# శుభోదయం!

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 02, సంచిక : 97, పేజిలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) గురువారం -26 - జూన్ - 2025


## ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక

మళ్లీ అణ్వాయుధ కార్యక్రమాలు చేపడితే తీవ్ర పరిణామాలు

ఇరాన్ యురేనియం శుద్ధిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర హెచ్చరిక




అణ్వాయుధాల జోలికి వెళ్తే మళ్లీ దాడులు తప్పవని వెల్లడి

ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధ విరమణకు పుతిన్ సాయాన్ని తిరస్కరించిన ట్రంప్

రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలుకుతానని ట్రంప్ ప్రకటన

## భారత్‌తో చర్చలకు సిద్ధం
## పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్




సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్‌తో టెలిఫోన్ సంభాషణ

వివిధ అంశాలపై చర్చించడానికి పాక్ సుముఖంగా ఉందన్న షరీఫ్

ఉగ్రవాదాన్ని నిర్మూలించే వరకు పాకిస్థాన్‌తో చర్చలు ఉండవన్న భారత్

## ముగ్గురు ఇజ్రాయెలీ గూఢచారులను ఉరితీసిన ఇరాన్..
## 700 మంది అరెస్ట్




మొసాద్‌కు సహకరించారన్న ఆరోపణలపై ముగ్గురిని ఉరితీసిన ఇరాన్

అమెరికా మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం

ఆ మరుసటి రోజే ఇరాన్‌లో ఈ అరెస్టులు, ఉరిశిక్షల అమలు

# రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి
# ఏపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది

★ ఒకప్పుడు దావోస్ వెళతామంటే... వద్దని సలహా ఇచ్చేవారు: చంద్రబాబు

★ విజయవాడలో ఫిక్కీ జాతీయ కార్యవర్గ సమావేశం

★ ముఖ్య అతిథిగా హాజరైన సీఎం చంద్రబాబు

★ గతంలో పారిశ్రామికవేత్తలతో మాట్లాడటానికి నేతలు వెనుకాడేవారన్న సీఎం

★ పీవీ నరసింహారావు ప్రపంచీకరణ నిర్ణయంతో దేశ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడిందని వ్యాఖ్య




అమరావతి: రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి ఏపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, పరిశ్రమలకు అనుకూలమైన వాతావరణం కల్పిస్తోందని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) ప్రశంసించింది. విజయవాడలో ఈరోజు జరిగిన ఫిక్కీ జాతీయ కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు ప్రతినిధులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా మిగతా..2లో

## ఇకపై ప్రతిరోజూ ప్రజలు, కార్యకర్తలతో
## మాట్లాడి ఫీడ్ బ్యాక్ తీసుకుంటాం




● జులై 2 నుంచి ప్రభుత్వ విజయాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని కేడర్‌కు లోకేశ్ పిలుపు

● తల్లికి వందనం, మెగా డీఎస్సీ వంటి హామీల అమలు ప్రస్తావన

● అహంకారం వీడి, ఓర్పు సహనంతో ప్రజా సమస్యలు పరిష్కరించాలని సూచన

● రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా కూటమి ఏర్పాటు అన్న మంత్రి

మచిలీపట్నం: రెడ్‌బుక్ పేరు వింటే వైకాపా నేతలకు గుండెపోటు వస్తోందని మంత్రి లోకేశ్ ఎద్దేవా చేశారు. కృష్ణా జిల్లా మచిలీపట్నం విచ్చేసిన లోకేశ్‌కు మంత్రులు కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభాష్, ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, వర్ల కుమార్‌రాజా, వెనిగండ్ల రాము, కాగిత కృష్ణప్రసాద్, తెదేపా శ్రేణులు ఘనస్వాగతం పలికారు. తెలుగు మహిళలు హారతి ఇచ్చారు. తల్లికి వందనం అమలు చేసినందుకు సంతోషంగా ఉందని మహిళలు ధన్యవాదాలు తెలిపారు. పిల్లలను మిగతా..2లో




## పవన్ పై కించపరిచే పోస్టులు...
## ముగ్గురు అరెస్ట్

● పవన్ ఫొటోలను మార్ఫింగ్ చేసిన ముగ్గురు వ్యక్తులు

● పోలీసులకు ఫిర్యాదు చేసిన జనసేన నాయకులు

● నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్న పోలీసులు

## ఆధునిక సాంకేతికతకు చిరునామాగా అమరావతి: సీఎం చంద్రబాబు

ఆధునిక సాంకేతికతకు చిరునామాగా రాజధాని అమరావతిని నిర్మిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. వందేళ్ల తర్వాత కూడా టెక్నాలజీలో ఎవరూ అందుకోలేని భవిష్యత్తు నగరంగా రాజధాని ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. విజయవాడలో ఫిక్కీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ కార్యనిర్వాహక సమావేశంలో చంద్రబాబు ప్రసంగించారు. దేశ పురోగతిలో ఐటీ కీలక పోషిస్తోందన్నారు. టెక్నాలజీని ముందుకు తీసుకెళ్లడంలో ఐటీ అభివృద్ధి ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. రానున్న రోజుల్లో సాంకేతిక పరిజ్ఞానంతో వివిధ రకాల డ్రోన్స్ మానవాళికి అనేక రకాలైన సేవలు అందుబాటులోకి తెస్తాయని వెల్లడించారు. సాంకేతకత జీవితంలో ఒక భాగంగా మారుతుందని చెప్పారు. డ్రోన్ల సాయంతో రాత్రి సమయంలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్నారన్నారు. ఏఐ, నాలెడ్జితో ఎన్నో అద్భుతాలు సృష్టిస్తున్నామని వెల్లడించారు. ప్రధాని మోదీ వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ లక్ష్యం నిర్దేశించుకున్నామన్నారు. రాబోయే రోజుల్లో అమరావతిలో మంచి అవకాశాలు రానున్నాయని తెలిపారు. హైదరాబాద్ ఏవిధంగా అభివృద్ధి జరిగిందో ఇంకా కొత్త తరహాలో అమరావతిని అభివృద్ధి చేస్తామని చంద్రబాబు వెల్లడించారు.




## హైదరాబాద్‌లో బోనాలు..
## నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం

హైదరాబాద్: జంటనగరాల్లో జరిగే బోనాల ఉత్సవాలకు తెలంగాణ ప్రభుత్వం రూ.20కోట్లు మంజూరు చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని 2,783 ఆలయాలకు వివిధ కార్యక్రమాలు నిర్వహణ కోసం నిధులను చెక్కుల రూపంలో జారీ చేసిందన్నారు. ఆషాఢ మాసంలో ముందుగా నగరంలోని గోల్కొండ బోనాలు జూన్ 29న జులై 1, 2 తేదీల్లో బల్కంపేట ఎల్లమ్మ బోనాలు, జులై 13, 14 తేదీల్లో శ్రీ ఉజ్జయిని మహాకాళి దేవస్థానం బోనాలు, జులై 20న లాల్ దర్వాజా బోనాలు.. జులై 23న చార్మినార్ భాగ్యలక్ష్మి బోనాలు, మిగిలిన దేవాలయాల్లో ఈ ఉత్సవాలు వైభవంగా జరుగుతాయని పేర్కొన్నారు.




## రాహుల్ గాంధీ కూడా రావణాసురుడేనా?.. రేవంత్ కు హరీశ్ ప్రశ్న

● గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై చర్చకు సిద్ధమంటూ హరీశ్ సవాల్

● కేసీఆర్‌పై సీఎం వ్యాఖ్యలు సంస్కారహీనమన్న హరీశ్

● గెలుపుపై భరోసా లేకే రైతు భరోసా అంటున్నారని ఆరోపణ

## ఎమర్జెన్సీ చీకటి ఘట్టం...
## ఏ భారతీయుడూ మర్చిపోడు

● ఎమర్జెన్సీ విధించి నేటికి 50 ఏళ్లు

● 'సంవిధాన్ హత్యా దివస్'గా జరుపుకుంటున్నామన్న మోదీ

● నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని విమర్శ



ఢిల్లీ: భారతదేశ చరిత్రలో ఎమర్జెన్సీ ఒక చీకటి అధ్యాయమని, ఆ రోజులను ఏ భారతీయుడూ మరిచిపోలేరని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఇందిరా గాంధీ ప్రభుత్వం దేశంలో ఎమర్జెన్సీ విధించి నేటికి సరిగ్గా 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ రోజును దేశ ప్రజలతో పాటు తాము కూడా 'సంవిధాన్ హత్యా దివస్'గా మిగతా..2లో

# లెక్కలతోనే మనం
# జవాబు ఇద్దాం

## 18 నెలల పాలన.. గోల్డెన్ పీరియడ్

ఇన్‌ఛార్జి మంత్రులు విభేదాలను చక్కదిద్దాలి

ఎదగడానికి పార్టీ పదవులే కీలకం

ఆనవాయితీగా మళ్లీ మనదే గెలుపు


ఆ సమయానికి సన్నద్ధంగా లేకపోతే బీఫాం మీ వద్దకు రాదు. ప్రసార సాధనాల్లో కొన్ని సహకరించవచ్చు



హైదరాబాద్: రాష్ట్రంలో గత 18 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలన గోల్డెన్ పీరియడ్ అని, రాబోయే రోజుల్లో అనేక అవకాశాలతో పాటు.. సవాళ్లు రాబోతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. "దేశంలో నియోజకవర్గాల పునర్విభజన జరగబోతోంది. సీట్లు పెరగబోతున్నాయి. మహిళా రిజర్వేషన్లతో వారికి మరిన్ని అవకాశాలు రానున్నాయి. జమిలి ఎన్నికలు తెస్తామంటున్నారు. ఇవన్నీ రాజకీయ అవకాశాలతో పాటు సవాళ్లనూ తీసుకొస్తాయి. అందుకు పార్టీ నాయకులంతా సిద్ధంగా ఉండాలి. ఆ సమయానికి సన్నద్ధంగా లేకపోతే బీఫాం మీ వద్దకు రాదు. ప్రసార సాధనాల్లో కొన్ని సహకరించవచ్చు.. మరికొన్ని సహకరించకపోవచ్చు. గత పదేళ్ల భారాస పాలనతో 18 నెలల కాంగ్రెస్ పాలనను పోల్చాలని, గ్రామాల్లో చర్చలు పెట్టాలని సవాల్ చేయండి. లెక్కలతోనే మనం జవాబు ఇద్దాం. విద్య, వైద్యం, రుణమాఫీ, రైతుభరోసా, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం వంటి లెక్కలన్నీ చెప్పి.. ప్రజలను ఒప్పించి పార్టీ నిర్మాణాన్ని ముందుకు తీసుకెళదాం.

ఇన్‌ఛార్జి మంత్రులు విభేదాలను చక్కదిద్దాలి

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక కోసం పార్టీని సిద్ధం చేయాలి. ఈ ఉపఎన్నికలో తానే అభ్యర్థిని అని కొందరు ప్రకటించుకోవడం సరికాదు. పార్టీ అభ్యర్థిని నిర్ణయించిన తరువాత బాధ్యతగా తీసుకుని గెలిపించు కుందాం. పదవులు రాలేదని కొందరు గాంధీభవన్‌కు గొర్రెలతో వచ్చి ధర్నాలు చేయడమేంటి? ఏమైనా సమస్యలుంటే జిల్లా ఇన్‌ఛార్జి మంత్రికి మిగతా..2లో




"దేశంలో నియోజకవర్గాల పునర్విభజన జరగబోతోంది మహిళా రిజర్వేషన్లతో వారికి మరిన్ని అవకాశాలు రానున్నాయి

## మాకు ఇండియా ఫస్ట్...
## కొందరికి మోదీ ఫస్ట్
### శశిథరూర్ పై ఖర్గే ఫైర్

● మోదీని పొగిడిన శశిథరూర్‌పై ఖర్గే తీవ్ర వ్యాఖ్యలు

● ఆపరేషన్ సిందూర్‌పై థరూర్ ఆర్టికల్‌తో కాంగ్రెస్‌లో దుమారం

● థరూర్ వ్యాఖ్యలు వ్యక్తిగతమే, పార్టీవి కావన్న కాంగ్రెస్



ఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కాంగ్రెస్ నేత శశిథరూర్ ప్రశంసించడంపై ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా స్పందించారు. "మాకు దేశమే ప్రథమం, కానీ కొందరు వ్యక్తులకు మోదీయే ప్రథమం" అంటూ శశిథరూర్ ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత భారతదేశం చేపట్టిన దౌత్యపరమైన చర్యలపై 'ది హిందూ' పత్రికలో శశిథరూర్ రాసిన వ్యాసం చుట్టూ జరుగుతున్న చర్చల నేపథ్యంలో ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ వ్యాసంలో, ప్రధానమంత్రి మోదీ శక్తి, చైతన్యం, ప్రపంచ వేదికపై నిమగ్నమవ్వాలనే ఆయన తపన భారతదేశానికి మిగతా..2లో



## కేసీఆర్ వల్లే రేవంత్ రెడ్డి సీఎం అయ్యారు: కవిత

● ఆరు గ్యారెంటీల అమలుపై అసెంబ్లీలో చర్చకు రావాలని రేవంత్ కు కవిత సవాల్

● మహిళలను కాంగ్రెస్ మోసం చేసిందని ఆరోపణ

● గోదావరి జలాలను చంద్రబాబుకు రేవంత్ గిఫ్ట్ గా ఇచ్చారని విమర్శ మిగతా..2లో

# ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక

అమెరికా : ఇరాన్ తన యురేనియం శుద్ధి కార్యక్రమాలను తక్షణమే నిలిపివేయాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా హెచ్చరించారు. టెహ్రాన్ మరోసారి అణ్వాయుధ కార్యక్రమాల దిశగా అడుగులు వేస్తే తీవ్ర పరిణామాలు తప్పవని, దాడులు చేయడానికి కూడా వెనుకాడబోమని ఆయన స్పష్టం చేశారు. ఇరాన్ మద్దతు ఉన్న సాయుధ ముఠాల ఆర్థిక వనరులను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ దాడులను ముమ్మరం చేసిన ప్రస్తుత తరుణంలో ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఇటీవల ఇజ్రాయెల్ వాయుసేన దక్షిణ లెబనాన్‌లో జరిపిన దాడిలో అల్ సాదిక్ కరెన్సీ ఎక్స్ఛేంజి అధిపతి అబ్దుల్లా బక్రి హతమయ్యారు. ఇరాన్‌కు చెందిన ఖుద్స్ ఫోర్స్ నుంచి హెజ్‌బొల్లాకు నిధులు మళ్లించడంలో ఈ సంస్థ కీలక పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ట్రంప్ హెచ్చరికలు ఇరాన్‌పై మరింత ఒత్తిడిని పెంచేవిగా ఉన్నాయి. మరోవైపు, డొనాల్డ్ ట్రంప్ సామాజిక మాధ్యమాల్లో చేసిన ఒక పోస్ట్ కూడా చర్చనీయాంశమైంది. "ఇరాన్, ఇజ్రాయెల్ రెండు దేశాలు కూడా యుద్ధం ఆగాలని సమానంగా కోరుకున్నాయి. ఇరాన్ అణుకేంద్రాలు, అణు సామర్థ్యాలను ధ్వంసం చేయడం నాకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. ఆ తర్వాతే యుద్ధాన్ని ఆపాను" అని ట్రంప్ ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు.

పుతిన్ సాయాన్ని తిరస్కరించా: ట్రంప్

ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో కాల్పుల విరమణకు తాను మధ్యవర్తిత్వం వహించి సాయం చేస్తానని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రతిపాదించినట్లు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. అయితే, ఆ ప్రతిపాదనను తాను సున్నితంగా తిరస్కరించినట్లు తెలిపారు. నెదర్లాండ్స్‌లో త్వరలో ప్రారంభం కానున్న నాటో సదస్సుకు వెళుతున్న సందర్భంగా 'ఎయిర్‌ఫోర్స్ వన్' విమానంలో ఆయన జర్నలిస్టులతో ఈ విషయాలను పంచుకున్నారు. "రష్యాతో ఒక ఒప్పందం కుదుర్చుకోవాలని నేను భావిస్తున్నాను. ఇటీవల పుతిన్ నాకు ఫోన్ చేసి 'ఇరాన్ యుద్ధం విషయంలో మీకు ఏమైనా సాయం చేయమంటారా?' అని అడిగారు. ఇరాన్ విషయంలో నాకు మీ సహాయం అవసరం లేదని స్పష్టంగా చెప్పాను. మీ (రష్యా) విషయంలోనే నాకు సహాయం కావాలి" అని పుతిన్‌తో అన్నట్లు ట్రంప్ వివరించారు. నాటో సదస్సులో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో భేటీ అయ్యే అవకాశాలున్నాయని కూడా ట్రంప్ తెలిపారు. ప్రస్తుతం జెలెన్‌స్కీ ఎన్నడూ లేనంత క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నారని ఆయన అభిప్రాయపడ్డారు. గత మూడేళ్లుగా కొనసాగుతున్న రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి త్వరలోనే ముగింపు పలికి, ఇరు దేశాల మధ్య శాంతి ఒప్పందం కుదిర్చేందుకు కృషి చేస్తానని ట్రంప్ ప్రకటించారు. గత వారంలోనే ఈ యుద్ధంలో సుమారు ఆరు వేల మంది సైనికులు మరణించినట్లు ఆయన పేర్కొన్నారు.

## భారత్‌తో చర్చలకు సిద్ధం
# పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్

ఢిల్లీ: ఉగ్రవాద కార్యకలాపాలను పూర్తిగా అరికట్టేంత వరకు పాకిస్థాన్‌తో ఎలాంటి చర్చలు జరిపేది లేదని భారత ప్రభుత్వం స్పష్టం చేస్తున్నప్పటికీ, పాకిస్థాన్ మాత్రం చర్చల అంశాన్ని పదేపదే లేవనెత్తుతోంది. ఇరు దేశాల మధ్య పరిష్కారం కాని వివాదాలపై అర్థవంతమైన చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తాజాగా మరోసారి ప్రకటించారు. సౌదీ అరేబియా యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ (ఎంబీఎస్)తో ఇటీవల జరిపిన టెలిఫోన్ సంభాషణలో షరీఫ్ ఈ అంశాన్ని ప్రస్తావించినట్లు రేడియో పాకిస్థాన్ తెలిపింది. జమ్మూకశ్మీర్ సమస్య, ఉగ్రవాదం, వాణిజ్య సంబంధాలు, జలాల పంపిణీ వంటి కీలక అంశాలపై చర్చించడానికి పాకిస్థాన్ సుముఖంగా ఉందని ఆయన పేర్కొన్నట్లు తెలిపింది. పశ్చిమాసియాలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులపై సౌదీ యువరాజు ఎంబీఎస్, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఫోన్‌లో చర్చించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా భారత్, పాకిస్థాన్ మధ్య ప్రస్తుతం నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులను షరీఫ్ ప్రస్తావించారని, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని చెప్పినట్లు సమాచారం. గతంలో పహల్గామ్ ప్రాంతంలో ఉగ్రదాడి జరిగిన అనంతరం, భారత సైన్యం పాకిస్థాన్‌పై సైనిక చర్య చేపట్టింది. ఈ పరిణామాల నేపథ్యంలో, అంతర్జాతీయ సమాజం నుంచి మద్దతు కూడగట్టేందుకు పాకిస్థాన్ ప్రయత్నించింది. ఇందులో భాగంగా సౌదీ అరేబియా, ఇరాన్, అజర్‌బైజాన్ వంటి దేశాలను సంప్రదించింది. పాకిస్థాన్‌తో చర్చల అంశంపై స్పందించిన భారత్, సరిహద్దు ఆవలి నుంచి ఉగ్రవాద కార్యకలాపాలు పూర్తిగా ఆగిపోయే వరకు ఎలాంటి చర్చలు ఉండవని తేల్చి చెప్పింది. ఉగ్రవాదం, చర్చలు ఏకకాలంలో కొనసాగడం అసాధ్యమని, నీరు, రక్తం కలిసి ప్రవహించలేవనే వాస్తవాన్ని గుర్తుంచుకోవాలని భారత్ గట్టిగా హెచ్చరించింది.

## ముగ్గురు ఇజ్రాయెలీ గూఢచారులను ఉరితీసిన ఇరాన్..
# 700 మంది అరెస్ట్


ఇజ్రాయెల్ : ఇజ్రాయెల్ గూఢచార సంస్థ మొసాద్‌కు సహకరించారన్న ఆరోపణలపై దోషులుగా తేలిన ముగ్గురు వ్యక్తులకు ఇరాన్ బుధవారం మరణశిక్ష అమలు చేసింది. ఆ దేశంతో సంబంధాలున్నాయనే ఆరోపణలపై సుమారు 700 మందిని అరెస్టు చేసినట్లు ప్రభుత్వ అనుబంధ నూర్‌న్యూస్ వెల్లడించింది. ఇరాన్ న్యాయవ్యవస్థకు చెందిన మిజాన్ న్యూస్ ఏజెన్సీ ముగ్గురి ఉరిశిక్ష విషయాన్ని ధ్రువీకరించింది. అమెరికా మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన మరుసటి రోజే ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. 12 రోజుల పాటు ఇరు దేశాల మధ్య తీవ్ర స్థాయిలో ఘర్షణలు చెలరేగిన అనంతరం, అమెరికా జోక్యంతో ఇరు పక్షాలు శాంతి ఒప్పందానికి అంగీకరించాయి. అయితే, ఈ ఒప్పందం జరిగి 24 గంటలు కూడా గడవకముందే మొసాద్ కోసం గూఢచర్యం చేశారన్న అభియోగాలపై ముగ్గురికి మరణశిక్ష విధించడం, యూదు దేశంతో సంబంధాలున్నాయనే నెపంతో వందల సంఖ్యలో ప్రజలను అరెస్టు చేయడం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చినప్పటికీ, ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు ఇంకా చల్లారలేదనడానికి ఈ ఘటనలు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

# కేసీఆర్ వల్లే రేవంత్ రెడ్డి సీఎం అయ్యారు: కవిత

హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు తీరు, మహిళలకు చేసిన వాగ్దానాలపై చర్చించేందుకు అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సవాల్ విసిరారు. ఇదే సమయంలో, పెన్షన్ల పెంపుదల వంటి హామీలను నెరవేర్చాలని కోరుతూ ఏఐసీసీ అగ్రనేత సోనియా గాంధీకి పోస్టుకార్డులు పంపే ఉద్యమానికి ఆమె శ్రీకారం చుట్టారు. గోదావరి జలాల అంశంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసరడంపై కవిత స్పందిస్తూ... "యస్.. అసెంబ్లీలో కచ్చితంగా చర్చిద్దాం. అయితే, ఆరు గ్యారెంటీల అమలు, మహిళలను మోసం చేసిన అంశాలపై కూడా చర్చ జరగాలి" అని డిమాండ్ చేశారు. కేసీఆర్ దమ్ము ఏమిటో అసలైన కాంగ్రెస్ పార్టీకి తెలుసు కాబట్టే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, తెలంగాణ వచ్చింది కాబట్టే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కాగలిగారని ఆమె అన్నారు. ఈ విషయాన్ని విస్మరించి రేవంత్ రెడ్డి మాట్లాడటం బాధాకరమని, ఆయన మరింత హుందాగా వ్యవహరించాలని సూచించారు. చంద్రబాబును రేవంత్ పిలిచి హైదరాబాద్ బిర్యానీ తినిపించి, గోదావరి నీళ్లను కానుకగా ఇచ్చారని కవిత ఆరోపించారు. రేవంత్ రెడ్డికి అబద్ధాలు చెప్పడం పరిపాటిగా మారిందని, 2016లో పోలవరం, బనకచర్ల అంశమే లేదని ఆమె వ్యాఖ్యానించారు. కేసీఆర్ కలలో కూడా తెలంగాణకు నష్టం తలపెట్టరని కవిత స్పష్టం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా ఎన్నికలకు వెళ్తే కాంగ్రెస్ పార్టీని ప్రజలు క్షమించరని ఆమె హెచ్చరించారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకులు సోనియా గాంధీ సంతకంతో కూడిన గ్యారెంటీ కార్డులను ఇంటింటికీ పంపిణీ చేశారని కవిత గుర్తు చేశారు. సోనియా గాంధీ ముఖం చూసి ఓట్లేసిన మహిళలను, వృద్ధులను, వికలాంగులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆమె ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీల ప్రకారం పెన్షన్ల మొత్తాన్ని పెంచేలా సీఎం రేవంత్ రెడ్డికి ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ వేలాది పోస్టుకార్డులను సోనియా గాంధీకి పంపుతున్నామని తెలిపారు. "కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు పూర్తయినా ఇచ్చిన హామీలు అమలు చేయలేదు. వృద్ధులకు రూ.2 వేల పెన్షన్ ను రూ.4 వేలకు పెంచుతామన్న హామీని విస్మరించారు. వికలాంగుల పెన్షన్ ను రూ.4 వేల నుంచి రూ.6 వేలకు పెంచకుండా మోసం చేశారు. మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామన్న హామీ ఏమైంది?" అని కవిత ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ హామీలన్నింటినీ తక్షణమే నెరవేర్చాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ పోస్టుకార్డుల ఉద్యమం ద్వారా ప్రభుత్వానికి తమ నిరసన తెలియజేస్తామని కవిత పేర్కొన్నారు.

## పవన్ పై  కించపరిచే పోస్టులు...
# ముగ్గురు అరెస్ట్

అమరావతి: ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ను కించపరుస్తూ సోషల్ మీడియాలో ప్రచారం చేసిన ముగ్గురు వ్యక్తులను కాకినాడ జిల్లా పిఠాపురం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయాన్ని పిఠాపురం సర్కిల్ ఇన్స్‌పెక్టర్ జి.శ్రీనివాస్ మీడియాకు తెలిపారు. విశాఖపట్నంలో జరిగిన ప్రపంచ యోగా దినోత్సవంలో ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి పవన్ పాల్గొన్న ఫొటోలను మార్ఫింగ్ చేసి, అభ్యంతరకరంగా సోషల్ మీడియాలో సర్క్యులేట్ చేశారని ఆయన వివరించారు. ఈ ఘటనపై జనసేన నాయకులు పిఠాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అరెస్టయిన వారిలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం ఎస్.యానానికి చెందిన కర్రి వెంకట సాయి వర్మ, మచిలీపట్నం మండలం వలందపాలెం గ్రామానికి చెందిన పాముల రామాంజనేయులు, హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ సింగరేణి కాలనీకి చెందిన షేక్ మహబూబ్ ఉన్నారు. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు వెల్లడించారు.



## ఇకపై ప్రతిరోజూ ప్రజలు, కార్యకర్తలతో
# మాట్లాడి ఫీడ్ బ్యాక్ తీసుకుంటాం

తల్లికి వందనం అమలు చేసినందుకు సంతోషంగా ఉందని మహిళలు ధన్యవాదాలు తెలిపారు. పిల్లలను చదివించేందుకు ఏ తల్లీ ఇబ్బంది పడకూడదనే తల్లికి వందనం అమలు చేశామని లోకేశ్ తెలిపారు. వైకాపా నేతలు మహిళలను కించపరిచేలా ఎలా మాట్లాడారో చూశామన్నారు. కూటమి ప్రభుత్వంలో మహిళలను గౌరవించే పరిస్థితి ఉంటుందన్నారు. త్వరలో పాఠశాలల్లో పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ పెడతామన్నారు. సమాజంలో మార్పు రావాలి, మహిళలతో మాట్లాడే విధానం మారాలన్నారు. చట్టాలు, డబ్బులతో ఆ మార్పు రాదన్నారు. బ్రాహ్మణి సహకారం లేకపోతే తాను ఏం చేయలేనని అన్నారు. తన తల్లి త్యాగం చేయకపోతే చంద్రబాబు రాష్ట్రానికి సేవ చేయలేరని అన్నారు. మహిళలకు గౌరవం పెరిగేలా ఈ ప్రభుత్వం చర్యలు చేపడుతుందని లోకేశ్ స్పష్టంచేశారు.

ఇకపై ప్రతిరోజూ ప్రజలు, కార్యకర్తలతో మాట్లాడి ఫీడ్ బ్యాక్ తీసుకుంటాం: మంత్రి లోకేశ్

రాష్ట్రంలో నూతనంగా కొలువుదీరిన కూటమి ప్రభుత్వ విజయాలను జులై 2వ తేదీ నుంచి ప్రతి ఇంటికీ చేరవేయాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మచిలీపట్నంలో నిర్వహించిన ఉత్తమ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన ఏ ఒక్క కార్యకర్తను విస్మరించేది లేదని, వారి సేవలను తప్పనిసరిగా గుర్తిస్తామని ఈ సందర్భంగా లోకేశ్ హామీ ఇచ్చారు. ఇకపై పార్టీ అధినేత చంద్రబాబు, తాను ప్రతిరోజూ ఐదుగురు ప్రజలు, ఐదుగురు కార్యకర్తలతో నేరుగా మాట్లాడి ప్రభుత్వ కార్యక్రమాల అమలు తీరు, పార్టీ అంతర్గత సమస్యలపై ఫీడ్‌బ్యాక్ తీసుకుంటామని లోకేశ్ వెల్లడించారు. "కమ్యూనికేషన్ గ్యాప్ వల్ల కొన్ని సమస్యలు తలెత్తుతున్నాయి. పార్టీ సంస్థాగత విషయాలు, సమస్యలపై చంద్రబాబుతో ఎప్పటికప్పుడు చర్చిస్తున్నాను. పది నిర్ణయాల్లో ఒక తప్పు జరిగే అవకాశం ఉంటుంది. అలాంటి పొరపాట్లు జరిగినప్పుడు వివిధ స్థాయిల్లోని నాయకుల ద్వారా మా దృష్టికి తీసుకువస్తే వాటిని సరిదిద్దుకుంటాం" అని ఆయన అన్నారు. గత ఎన్నికలకు ముందు నిర్వహించిన బాబు సూపర్%-%6, బాబు ష్యూరిటీ%-%భవిష్యత్తుకు గ్యారంటీ వంటి కార్యక్రమాలతో పాటు ఎన్నికల అనంతరం చేపట్టిన మన టీడీపీ, సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో కార్యకర్తలు చురుగ్గా పాల్గొన్నారని ప్రశంసించారు. పార్టీ కార్యకలాపాలను డిజిటల్ విధానంలో ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానించి పనిచేసిన వారిని గుర్తించాలన్నదే తమ పార్టీ విధానమని స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చాక కూడా కేడర్‌ను మరువకుండా చంద్రబాబు, తాను ప్రతి జిల్లాకు వెళ్లినప్పుడల్లా కార్యకర్తలను కలుస్తున్నామని గుర్తుచేశారు.



జులై 2 నుంచి గడవగడవకు వెళ్లండి

జులై 2వ తేదీ నుంచి ప్రతిఒక్కరూ గడపగడపకు వెళ్లి, గత ఏడాది కాలంలో ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు వివరించాలని లోకేశ్ దిశానిర్దేశం చేశారు. "బాబు సూపర్ – 6 కార్యక్రమాలన్నింటినీ ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం. తల్లికి వందనం పథకం కింద ఒకే జీఓతో రూ.8,745 కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమచేశాం. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనప్పటికీ నిర్దేశిత సమయానికే తల్లికి వందనం పథకాన్ని విజయవంతంగా అమలుచేశాం" అని తెలిపారు. మెగా డీఎస్సీ ద్వారా 16,347 టీచర్ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టామని, పెద్దఎత్తున పరిశ్రమలను ఆకర్షించడం ద్వారా ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనకు శాయశక్తులా కృషిచేస్తున్నామని వివరించారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా వృద్ధులకు రూ.4,000 పెన్షన్ అందిస్తున్నామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని అమలు చేయబోతున్నామని లోకేశ్ ప్రకటించారు.

# ఎమర్జెన్సీ చీకటి ఘట్టం... ఏ భారతీయుడూ మర్చిపోడు

మొదటి పేజి తరువాయి



ఈ రోజును దేశ ప్రజలతో పాటు తాము కూడా 'సంవిధాన్ హత్యా దివస్'గా పరిగణిస్తున్నామని తెలిపారు. ఎమర్జెన్సీ కాలంలో నాటి పాలకులు భారత రాజ్యాంగంలో పొందుపరిచిన విలువలను పూర్తిగా పక్కనపెట్టారని ప్రధాని మోదీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సమయంలో ప్రాథమిక హక్కులను కాలరాశారని, పత్రికా స్వేచ్ఛను దారుణంగా అణచివేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థులు, చివరికి సామాన్య పౌరులను కూడా అన్యాయంగా జైళ్లలో నిర్బంధించారని ఆరోపించారు. ఆ సమయంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్నే అరెస్టు చేసినట్లుగా అనిపించిందని మోదీ వ్యాఖ్యానించారు. ఎమర్జెన్సీ నాటి భయానక పరిస్థితులను ఏ భారతీయుడూ అంత తేలికగా మరచిపోలేరని ప్రధాని పునరుద్ఘాటించారు. ఆ దుర్మార్గమైన పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ప్రతి ఒక్కరికీ తాను సెల్యూట్ చేస్తున్నానని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడేందుకు సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు మొక్కవోని దీక్షతో పోరాటం చేశారని గుర్తుచేశారు. వారి అలుపెరగని పోరాటం వల్లే చివరికి ఎమర్జెన్సీని ఎత్తివేయాల్సి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగంలోని మౌలిక సూత్రాలను మరింత బలోపేతం చేస్తామని, వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని మోదీ తెలిపారు. పేదలు, అణగారిన వర్గాల ప్రజల కలలను సాకారం చేయడమే తమ ధ్యేయమని అన్నారు. ఈ సందర్భంగా, ఎమర్జెన్సీకి 50 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో 'ది ఎమర్జెన్సీ డైరీస్' పేరుతో తాను ఒక పుస్తకాన్ని తీసుకురాబోతున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌గా తన ప్రస్థానం, ఎమర్జెన్సీ రోజుల్లో నెలకొన్న క్లిష్ట పరిస్థితులు, తన అనుభవాలను ఆ పుస్తకంలో వివరంగా పొందుపరచనున్నట్లు ఆయన తెలిపారు. ఈ పుస్తకం ద్వారా నాటి చీకటి రోజులకు సంబంధించిన అనేక తెలియని విషయాలు వెలుగులోకి వస్తాయని భావిస్తున్నారు.


# రాహుల్ గాంధీ కూడా రావణాసురుడేనా?.. రేవంత్ కు హరీశ్ ప్రశ్న



హైదరాబాద్: రైతు భరోసా కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రంగా స్పందించారు. గోదావరి–బనకచర్ల ప్రాజెక్టుపై ఏ వేదికపైనైనా చర్చకు సిద్ధమని, తెలంగాణకు జరుగుతున్న ద్రోహాన్ని గణాంకాలతో సహా నిరూపిస్తానని 'ఎక్స్' వేదికగా సవాల్ విసిరారు. ప్రభుత్వ కార్యక్రమంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి సంస్కారం లేని విధంగా మాట్లాడి తన చిల్లర బుద్ధిని మరోసారి ప్రదర్శించారని హరీశ్‌రావు విమర్శించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలోని అద్భుత ప్రగతిని తక్కువ చేసి చూపి రాష్ట్ర ప్రజలను అవమానించారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపుపై భరోసా లేకనే విధిలేని పరిస్థితుల్లో రైతుభరోసా వేస్తున్నారని, లక్ష కోట్లు కూడా ఖర్చుకాని కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి జరిగిందనడం ప్రపంచం నవ్విపోతోందని పేర్కొన్నారు. మేడిగడ్డలో కుంగిన రెండు పిల్లర్లకు మరమ్మతులు చేయలేని దద్దమ్మ ఇప్పుడు అన్నారం, సుందిళ్ల కూడా కూలాయని అంటున్నారని, అది నోరా మోరా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. దమ్ముంటే, ఇసుమంతైనా నిజాయితీ ఉంటే 30 లక్షల మంది కౌలు రైతులకు ఇస్తానన్న రైతు భరోసా ఇచ్చి మాట్లాడాలని, సన్న వడ్లకు రూ.1,200 కోట్ల బోనస్ బకాయిలు రైతుల ఖాతాల్లో వేయాలని డిమాండ్ చేశారు. హామీలపై ప్రశ్నిస్తున్నందుకే తమపై బూతులతో చెలరేగుతున్నారని, అయినా తాము సంయమనం కోల్పోబోమని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఇచ్చిన హామీలు అమలయ్యేంత వరకు అబద్ధాల పుట్టను బద్దలు కొడుతూనే ఉంటామని హెచ్చరించారు. "గెలిచిన వాడు రాజు, ఓడిపోయిన వాడు రావణాసురుడు" అని సీఎం అంటున్నారని, మరి రాహుల్ గాంధీ కూడా రావణాసురుడేనా అని నిలదీశారు.

# మాకు ఇండియా ఫస్ట్... కొందరికి మోదీ ఫస్ట్

మొదటి పేజి తరువాయి



ప్రధానమంత్రి మోదీ శక్తి, చైతన్యం, ప్రపంచ వేదికపై నిమగ్నమవ్వాలనే ఆయన తపన భారతదేశానికి "ప్రధాన ఆస్తి"గా నిలుస్తోందని, అయితే దీనికి మరింత మద్దతు అవసరమని థరూర్ పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీని ఇబ్బందికి గురిచేయడమే కాకుండా... పార్టీ హైకమాండ్ కు, థరూర్‌కు మధ్య దూరాన్ని మరింత పెంచాయి. పార్టీ లైన్‌కు అనుగుణంగా థరూర్ మాట్లాడకపోవడంపై హైకమాండ్ అసంతృప్తితో ఉంది. మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ, "శశిథరూర్ ఇంగ్లిష్ చాలా ధారాళంగా మాట్లాడతారు. నాకు ఇంగ్లిష్ అంత బాగా రాదు. ఆయన భాష చాలా బాగుంటుంది. అందుకే ఆయన్ను కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడిగా నియమించాం" అని అన్నారు. 26 మంది అమాయకులు మరణించిన పహల్గామ్ దాడి తర్వాత, ప్రతిపక్షాలన్నీ సైన్యానికి అండగా నిలుస్తాయని చెప్పాయని ఖర్గే గుర్తుచేశారు. "దేశం ముందు, పార్టీ తర్వాత అన్నాం. కానీ కొందరు వ్యక్తులు 'మోదీ ముందు, దేశం తర్వాత' అని భావిస్తున్నారు. మేమేం చేయగలం?" అని ఆయన వ్యాఖ్యానించారు. మరోవైపు ఓ కార్యక్రమంలో థరూర్ మాట్లాడుతూ, తాను రాసిన వ్యాసాన్ని తాను బీజేపీలో చేరడానికి చేస్తున్న ప్రయత్నంగా చూడరాదని, అది జాతీయ ఐక్యత, దేశ ప్రయోజనాలు, భారతదేశానికి అండగా నిలవడమనే ఉద్దేశంతో చేసిందని స్పష్టం చేశారు.

# రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి ఏపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది

మొదటి పేజి తరువాయి

ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫిక్కీ ప్రతినిధులు ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. సమావేశంలో ఫిక్కీ ప్రతినిధులు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానాలు, తీసుకుంటున్న చర్యలు పరిశ్రమల అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతున్నాయని కొనియాడారు. ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) విషయంలో చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం చూపుతున్న చొరవను వారు ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న "స్వర్ణాంధ్ర విజన్ 2047" లక్ష్యాలను సాకారం చేసేందుకు తమవంతు సంపూర్ణ మద్దతు ఉంటుందని ఫిక్కీ జాతీయ కార్యవర్గం ప్రభుత్వానికి హామీ ఇచ్చింది. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, గతంలో నాటి ప్రధాని పీవీ నరసింహారావు ప్రపంచీకరణకు (గ్లోబలైజేషన్) పచ్చజెండా ఊపడం వల్లే దేశ ఆర్థిక వ్యవస్థ గాడిన పడిందని తెలిపారు. పీవీ నరసింహారావు ఆ నిర్ణయం కొన్ని తప్పనిసరి పరిస్థితుల్లో తీసుకున్నారని కొందరు చెబుతున్నప్పటికీ, ఆ చర్య దేశానికి ఎంతో మేలు చేసిందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, మనం ఇప్పుడు క్వాంటమ్ కంప్యూటర్ వంటి ఆధునిక సాంకేతికతల గురించి మాట్లాడుకుంటున్నామని ఆయన అన్నారు. వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన ఫిక్కీ వంటి సంస్థలు దేశ పారిశ్రామిక ప్రగతిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గతంలో తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పారిశ్రామికవేత్తలతో మాట్లాడి రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించేందుకు అనేకసార్లు దావోస్ వంటి ప్రపంచ ఆర్థిక సదస్సులకు హాజరయ్యానని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. "ఒకప్పుడు వ్యాపారవేత్తలతో రాజకీయ నాయకులు పెద్దగా మాట్లాడేవారు కాదు. దావోస్ వెళ్తామంటే, ప్రజల్లో తప్పుడు సంకేతాలు వెళ్తాయని వద్దని సలహా ఇచ్చేవారు. అయినా నేను వెళ్ళాను, పారిశ్రామికవేత్తలతో చర్చించి రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడానికి ప్రయత్నించాను" అని ఆయన తన అనుభవాలను పంచుకున్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి పారిశ్రామిక ప్రగతి కీలకమని, ఆ దిశగా ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. ఆధునిక సాంకేతికతకు చిరునామాగా రాజధాని అమరావతిని నిర్మిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. వందేళ్ల తర్వాత కూడా టెక్నాలజీలో ఎవరూ అందుకోలేని భవిష్యత్తు నగరంగా రాజధాని ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. విజయవాడలో ఫిక్కీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ కార్యనిర్వాహక సమావేశంలో చంద్రబాబు ప్రసంగించారు. దేశ పురోగతిలో ఐటీ కీలక పోషిస్తోందన్నారు. టెక్నాలజీని ముందుకు తీసుకెళ్లడంలో ఐటీ అభివృద్ధి ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. రానున్న రోజుల్లో సాంకేతిక పరిజ్ఞానంతో వివిధ రకాల డ్రోన్స్ మానవాళికి అనేక రకాలైన సేవలు అందుబాటులోకి తెస్తాయని వెల్లడించారు. సాంకేతకత జీవితంలో ఒక భాగంగా మారుతుందని చెప్పారు. డ్రోన్ల సాయంతో రాత్రి సమయంలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్నారన్నారు. ఏఐ, నాలెడ్జితో ఎన్నో అద్భుతాలు సృష్టిస్తున్నామని వెల్లడించారు. ప్రధాని మోదీ వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ లక్ష్యం నిర్దేశించుకున్నామన్నారు. రాబోయే రోజుల్లో అమరావతిలో మంచి అవకాశాలు రానున్నాయని తెలిపారు. హైదరాబాద్ ఏవిధంగా అభివృద్ధి జరిగిందో ఇంకా కొత్త తరహాలో అమరావతిని అభివృద్ధి చేస్తామని చంద్రబాబు వెల్లడించారు.

# లెక్కలతోనే మనం జవాబు ఇద్దాం

మొదటి పేజి తరువాయి

ఏమైనా సమస్యలుంటే జిల్లా ఇన్‌ఛార్జి మంత్రికి లేదా నాకు, పీసీసీ అధ్యక్షుడికి చెప్పుకొనే అవకాశం అందరికీ ఉంటుంది. అలా కాకుండా గాంధీభవన్‌కు వచ్చి ధర్నాలు చేయడం సరికాదు. ఇలాంటివి జరగకుండా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులు ముందే చొరవ చూపి పార్టీలో అంతర్గత విభేదాలను సరిదిద్దాలి. పోలింగ్ కేంద్రం స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకూ పార్టీ కమిటీలన్నిటినీ వెంటనే ఏర్పాటు చేయాలి. బూత్ స్థాయిలో పార్టీ బలంగా ఉంటే ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లగలుగుతాం. పార్టీ నిర్మాణంపై పీసీసీ దృష్టి సారించాలి. పార్టీ కమిటీల్లో ఉన్న నాయకులు క్షేత్రస్థాయిలో పనిచేస్తేనే పదవులు వస్తాయి. పార్టీ కష్టకాలంలో పనిచేసిన వారికి పదవులిచ్చాం. మార్కెట్ కమిటీలు, దేవాలయాల కమిటీల వంటి నామినేటెడ్ పోస్టుల భర్తీకి అర్హులైన నాయకుల పేర్లను జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులు ప్రతిపాదించాలి. ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. అనేక సామాజికాంశాలను కూడా పరిష్కరించింది.. వీటిని ప్రజలకు చెప్పడానికి నేను గ్రామాల్లోకి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాను. ఏ రాజకీయ నాయకులైనా గ్రామస్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయి వరకూ ఎదగడానికి పార్టీ వేదికలే ఉపయోగపడతాయి. వేల మంది పీసీసీ రాష్ట్ర నూతన కార్యవర్గ పదవులకు పోటీపడ్డారు. అందులో నుంచి కొందరిని ఎంపిక చేసి అవకాశమిచ్చారంటే.. వారు పార్టీని ముందుకు నడిపించడంలో, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో చురుగ్గా పనిచేస్తారని గుర్తించడం వల్లేనని తెలుసుకోవాలి. పీసీసీ పదవులు దక్కినవారిలో బాగా పనిచేసే వారికి.. 2029లో ఏర్పడే ప్రభుత్వంలో అవకాశాలు వస్తాయి. నేను 2018లో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, 2023లో సీఎంగా బాధ్యతలు చేపట్టానంటే పార్టీ బాధ్యత నుంచే నాకు పదోన్నతి వచ్చింది. జిల్లా పార్టీ అధ్యక్షులుగా రాణించినవారు అనేకమంది ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా ఎదిగారు. గతంలో కొందరు నేతలకు పార్టీ రాష్ట్ర అనుబంధ సంస్థల బాధ్యతలు ఇస్తామంటే అవి తమ హోదాకు తక్కువ అని, వాటిని తీసుకోం అని తిరస్కరించారు. ఆ రోజు వాటిని తీసుకుని పార్టీ కోసం పనిచేయడానికి ముందుకు వచ్చిన వారిలో 65 మందికి.. ఇప్పుడు కార్పొరేషన్ ఛైర్మన్లుగా, ఎంపీలుగా, ఎమ్మెల్సీలుగా పదవులు దక్కాయి. నిర్మలా జగ్గారెడ్డి కష్టపడినందునే పార్టీ ఆమెకు కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పదవి ఇచ్చింది. పీసీసీ కార్యవర్గ పదవీ కాలం మూడేళ్లు మాత్రమే. 2029లో అసెంబ్లీ ఎన్నికలు వస్తాయి. అప్పటిలోగా పనిచేయని వారిని బాధ్యతల నుంచి పీసీసీ అధ్యక్షుడు పక్కన పెడతారు. కార్యకర్తలు పోటీచేసే స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయి. వారిని గెలిపించుకునే వారికి రాష్ట్రస్థాయి పదవులు వస్తాయి. అప్పుడే పార్టీ బలోపేతమై రెండోసారి అధికారంలోకి వస్తుంది. గతంలో అన్ని పార్టీలు వరుసగా రెండేసిసార్లు అధికారంలోకి వచ్చాయి. కాంగ్రెస్ కూడా ఇదే ఆనవాయితీతో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ గెలుస్తుంది. పబ్లిక్ సర్వీసు కమిషన్‌ను గత భారాస ప్రభుత్వం దళారుల అడ్డాగా మార్చింది. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 60 వేల ఉద్యోగాలిచ్చాం. పేదవాడికి విద్యను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. విద్యార్థుల డైట్ ఛార్జీలు పెంచాం. గత 18 నెలల్లో రూ.1.04 లక్షల కోట్లు రైతుల కోసం ఖర్చుపెట్టిన ప్రభుత్వం మనది. ప్రతి విషయంలో కాంగ్రెస్ ఆదర్శంగా నిలిచి ముందుకెళుతోంది. కులగణన సర్వే నిర్వహించి దేశమంతా జరిగేలా కేంద్రప్రభుత్వం మెడలు వంచాం. ఎస్సీ వర్గీకరణను అమల్లోకి తెచ్చాం. రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చి అభివృద్ధిపథంలో నడిపిస్తున్నాం" అని వివరించారు. పీసీసీ నూతన ఉపాధ్యక్షులుగా, ప్రధాన కార్యదర్శులుగా నియమితులైన వారికి నియామక పత్రాలను సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అందజేశారు. ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్, మంత్రులు దామోదర్ రాజనర్సింహ, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, వివేక్, అడ్లూరి లక్ష్మణ్, ఇతర సీనియర్ నేతలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శుభోదయం
ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!
WWW.SUBHODAYAMDAILY.COM

జనరల్ న్యూస్

గురువారం - 26 - జూన్ - 2025

## బీఎస్పీ జిల్లా ఇన్చార్జిగా బైనేని శ్రీనివాసరాజు




గుంతకల్లు ప్రతినిధి - పల్లె రామాంజనేయులు జూన్ 26 (శుభోదయం న్యూస్): బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఇన్చార్జిగా బైనేని శ్రీనివాస్ రాజును నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతమ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు కాగా గుంతకల్లుకు చెందిన బైనేని శ్రీనివాసరాజు బీఎస్పీ పార్టీలో చాలా సంవత్సరాలుగా సేవలందిస్తున్నారు ఈ సందర్భంగా పైనేని శ్రీనివాస్ రాజు మాట్లాడుతూ నా మీద నమ్మకంతో జిల్లా ఇన్చార్జి బాధ్యతలు ఇచ్చిన బి.ఎస్.పి రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతమ్ కుమార్ కి కృతజ్ఞతలు తెలుపుతూ జిల్లాలో పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండాకృషి చేస్తానని, జిల్లాలో అందరినీ కలుపుకొని పార్టీ అభివృద్ధికి మరింత తోడ్పడుతానని, ఈ నా నియామకానికి సహకరించిన రాష్ట్ర కార్యదర్శులు రాయలసీమ జోన్ ఇన్చార్జిలు గద్దల నాగభూషణం కి, చిందనూరు నాగరాజు కి, జిల్లా అధ్యక్షులు కాసాని నాగరాజు కి మరియు జిల్లా కమిటీ వారికి, సీనియర్ నాయకులకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## బ్రహ్మంగారిమఠం మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన.....

### మైదుకూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఏపీ రవీంద్ర..




బద్వేల్ నియోజకవర్గం రిపోర్టర్ శివారెడ్డి (శుభోదయం న్యూస్ ): మండల సర్వసభ్య సమావేశంలో మల్లేపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ చిలమల నారాయణ శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బ్రహ్మం గారి మఠం మండల రైతుల కోసం మార్కెట్ కమిటీ తరపున అవసరమైన సదుపాయాలు కల్పిస్తాం.నూతన గోడౌన్ ల నిర్మాణం చేపట్టి రైతులు ధాన్యం నిల్వ ఉంచుకునేఅందుకు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ గారి సహకారం తో కృషి చేస్తాం.మార్కెట్ యార్డ్ నూతన ఏసీ గోడౌన్ నిర్ణయం చేయాలనీ కూడ ఆలోచన చేస్తున్నాం.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షుడు వీరనారాయణరెడ్డి ఎంపీడీవో వీర కిషోర్ మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి మండల స్థాయి అధికారులు సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు..

## ఘనంగా ఏ.ఐ.ఎస్.బి 75వ ఆవిర్భావ దినోత్సవం ఏ.ఐ.ఎస్.బి జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్ర ప్రసాద్



బద్వేల్ నియోజకవర్గం రిపోర్టర్ శివారెడ్డి (శుభోదయం న్యూస్ ): విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థుల పక్షాన నిరంతరం పోరాటాలే ఏ.ఐ.ఎస్.బి లక్ష్యం అని అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏ.ఐ.ఎస్.బి) జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. ఏ.ఐ.ఎస్.బి 75వ ఆవిర్భావ దినోత్సవం సంధ్భంగా బుధవారం సాయంకాలం బద్వేలు లోని ఎస్సీ బాలుర కళాశాల హాస్టల్ నందు ఏ.ఐ.ఎస్.బి జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... సోషలిజం, శాంతి, అభ్యుదయం లక్ష్యాలుగా అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏ.ఐ.ఎస్.బి) 1951 జూన్ 25న ఏర్పాటు అయిందని అప్పటినుంచి ఇప్పటివరకు నిరంతరం విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తుందని వారు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తూ కార్పోరేట్ విద్యకు రెడ్ కార్పెట్ పరుస్తుందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకువచ్చి పాఠశాలల విలీనం పేరుతో పేద మధ్యతరగతి గ్రామీణ విద్యార్థులను విద్యకు దూరం చేస్తుందని వారు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఇవ్వవలసినటువంటి ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయకుండా విద్యార్థులను వేధిస్తుందన్నారు. జీఓ నెంబర్ 77 ను వెంటనే రద్దుచేసి పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులు భర్తీ చేయకుండా విద్యార్థుల జీవితాలతో చలగాటం ఆడుతున్నావని వారు తెలిపారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు పెండింగ్లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తుందని వారు తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని డిమాండ్ చేసారు. లేని పక్షంలో విద్యార్థుల పక్షాన అఖిల భారత విద్యార్థి బ్లాక్ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఏ.ఐ.ఎస్.బి నాయకులు మనోజ్, సుహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## అగ్రిగోల్డ్ బాధితులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి



గుంతకల్లు ప్రతినిధి - పల్లె రామాంజనేయులు జూన్ 26 (శుభోదయం న్యూస్) : అగ్రిగోల్డ్ బాధితులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు డిమాండ్ చేశారు బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో అగ్రిగోల్డ్ బాధితుల సర్వసభ్య సమావేశం జరిగింది కార్యక్రమంలో అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు అనంతపురం జిల్లా అధ్యక్షులు బి నారాయణప్ప గుంతకల్ బ్రాంచ్ అగ్రిగోల్డ్ బాధ్యులు వెంకటేశు గౌరమ్మ జయమ్మ తదితరులు ఆధ్వర్యంలో ఒక 20 మందితో మాట్లాడటం జరిగింది ప్రభుత్వం ముందుకు వచ్చి రాష్ట్ర కమిటీలు జిల్లా స్థాయి కమిటీలు వేసి ఆస్తుల వెరిఫికేషన్ చేయటం అదే విధంగా స్పెషల్ కోర్టు కోసం ప్రయత్నం చేయడం హర్షించదగ్గ విషయం అని ప్రభుత్వానికి అభినందనలు తెలియజేసినారు ప్రభుత్వం కమిటీలతో కాలయాపన చేయకుండా త్వరగా స్పెషల్ కోర్టు ఏర్పాటు చేసి అదే విధంగా సిఐడి వారిని కూడా ఒక సిట్ ఏర్పాటు చేసి అగ్రిగోల్డ్ ఆస్తుల వెరిఫికేషన్ ప్రక్రియని వేగవంతంగా పూర్తి చేసి వాటిని వేలం ద్వారా అమ్మి గాని లేదా బాధితులకు భూములు ఇవ్వడం ద్వారా గాని త్వరగా సమస్యను పరిష్కరించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు ప్రభుత్వాన్ని కోరారు ప్రభుత్వం ఎక్కడ నిర్లక్ష్యం వహించిన మరొక ఉద్యమానికి అందరం సిద్ధం కావాలని బాధితులని కోరారు ప్రభుత్వం ఏదో పని చేస్తుంది కదా అని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ సైలెంట్ గా లేదని రాష్ట్రవ్యాప్తంగా అగ్రిగోల్డ్ బాధితులు అందరిని కలిసి జరుగుతున్నటువంటి విషయాలు తెలియజేస్తూ ప్రభుత్వం త్వరగా పని చేయాలని చేయకపోతే మనమందరం మరొక ఉద్యమానికి ముందుకు పోవాలని తెలియజేశారు.

## జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం



తనకల్లు, మండల రిపోర్టర్ - రవీంద్ర (శుభోదయం న్యూస్): అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా తనకల్లు ప్రోహిబిషన్ ఎక్సైజ్ వారు స్థానిక జూనియర్ కళాశాల నందు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ నేటి యువత మాదకద్రవ్యల సేవనం వలన సమాజంలో కలుగుతున్న దుష్పరిణామాలు, వారికి వస్తున్న సమస్యలు, వ్యాసనాలకు బానిస అయినవారు వాటి నుండి విముక్తి ఎలా పొందలో మరియు మాదకద్రవ్యల చట్టాలు గురించి అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మారుతి రావు, ప్రోహిబిషన్ %డ% ఎక్సైజ్ ఇన్స్పెక్టర్, జీలానీ బాషా మరియు తిప్పేస్వామి, ప్రోహిబిషన్ %డ% ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్స్, మరియు తనకల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్,చెన్నకేశవ ప్రసాద్, లెక్చరర్స్ శ్రీమతి ప్రమీల, ప్రభాకర్, బైరెడ్డి మరియు ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటరమణ రెడ్డి పాల్గొన్నారు.

## కోనేరు అభివృద్ధికి కూటమి ప్రభుత్వ చర్యలు



ఎర్రగొండపాలెం, మండల రిపోర్టర్ - నారాయణ (శుభోదయ న్యూస్): నియోజకవర్గ కేంద్రంలో 30 సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోని ఆధ్వానంగా ఉన్న కోనేరును అభివృద్ధి చేయాలని అధికారులను కోరిన ఎరిక్షన్ బాబు పరిశీలించిన అధికారులు, కూటమి నాయకులు - త్వరలోనే పనులు ప్రారంభం..యర్రగొండపాలెం పట్టణంలోని నడిబొడ్డున ఉన్న కోనేరు గత 30 సంవత్సరాలుగా ఆధ్వానంగా మారింది. ఈ విషయంపై యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు స్పందించారు. గ్రామంలో 5 కోనేరులు ఉండాలని 4 కోనేరులు కనుమరుగయ్యాయని ఉన్న ఈ ఒక్క కోనేరును అధునీకరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుందని తెలిపారు. దీంతో మండల నాయకులను ఆదేశించి కోనేరును అధికారులతో కలిసి నాయకులు పరిశీలించారు. త్వరలోనే కోనేరు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టబోతున్నట్లు అధికారులు, నాయకులు తెలిపారు. చేయవలసిన పనులను కోనేరు వద్ద వెళ్లి పరిశీలించారు. త్వరలోనే కోనేరు అభివృద్ధి పనులకు ఎరిక్షన్ బాబు శ్రీకారం చూడతారని నాయకులు తెలిపారు. అనంతరం శివాలయంలో అధికారులు, నాయకులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో యర్రగొండపాలెం మండల టీడీపీ అధ్యక్షులు చేకూరి సుబ్బారావు ఎంపీడీఓ శ్రీనివాస్ ఉపాధి హామీ అధికారులు, పంచాయతీ అధికారి, ఇంజనీరింగ్ అధికారులు, టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.



## సీఎం సహాయనిధి పేదలకు వరం : యార్లగడ్డ



గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ - సురేష్ (శుభోదయం న్యూస్) : ముఖ్యమంత్రి సహాయనిధి పేదరోగుల పాలిట వరంగా మారిందని ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. గన్నవరం నియోజకవర్గంలోని ఇరువురు రోగులకు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధినుండి మంజూరు చేయించిన ఎల్ఓసి లను ఆయన అందజేశారు. మంగళవారం రాత్రి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉంగుటూరుకు చెందిన అంబటి రంగారావుకు రూ.70 వేలు, గన్నవరంవాసి నాగసూరి లక్ష్మీ నాంచారయ్యకు రూ.2.75 లక్షల ఎల్ఓసిలను రోగుల కుటుంబ సభ్యులకు వెంకట్రావు అందజేశారు.



ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ పేద రోగులకు సత్వర, కార్పొరేట్ వైద్యం అందించేందుకు సీఎం సహాయనిధి ద్వారా నిధులు మంజూరు చేయిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను గ్రామ టి.డి.పి. కమిటీలు విస్తృతంగా ప్రచారం చేయాలి



గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ - సురేష్ (శుభోదయం న్యూస్) :గన్నవరం నియోజకవర్గంలో కొత్తగా నియమించబడిన గ్రామ టి.డి.పి. కమిటీ బాధ్యులు ప్రభుత్వం అమలుచేసే సంక్షేమ కార్యక్రమాలను గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని బాపులపాడు మండల టిడిపి ఎన్నికల పరిశీలకులు రాష్ట్ర అగ్నికుల క్షత్రియుల కార్పొరేషన్ డైరెక్టర్ పీతా గోపీచంద్ సూచించారు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు గన్నవరం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు సూచనల మేరకు బాపులపాడు మండలం, రంగన్నగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామ తెలుగుదేశం పార్టీ కమిటీ సమావేశంలో గ్రామ టి.డి.పి. కమిటీని ఏకగ్రీవంగా ఏర్పాటు చేసుకున్నారు. గ్రామ టి.డి.పి. అధ్యక్షులుగా పలగాని వీరాంజనేయులు, ఉపాధ్యక్షులుగా కొలుసు రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా మైనేని శ్రీనివాసరావు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా తలారి యోహాను, దేవరకొండ రాంబాబు, గుర్రాల శ్రీనివాసరావు, కార్యదర్శులుగా సగ్గుర్తి కాశీవిశ్వనాథం, ఆలపాటి శ్రీనివాసరావు, దువ్వూరి ఏసురాజు, కోశాధికారిగా మదుపల్లి ఉమామహేశ్వరరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ తెలుగుయువత, తెలుగు మహిళ, తెలుగు రైతు, ఇతర అనుబంధ సంఘాలకు కూడా అధ్యక్ష, కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బాపులపాడు మండలంలోనే గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులందరు సమైక్యంగా ఉండి గత ప్రభుత్వ హయాంలో వై.సి.పి. గాలిలో కూడా గ్రామ సర్పంచ్, ఎం.పి.టి.సి. సభ్యులను తెలుగుదేశం పార్టీ తరపున గెలిపించటం గొప్ప విషయమని పీతా గోపీచంద్ కొనియాడారు. ఈ సమావేశంలో సీనియర్ టి.డి.పి. నాయకులు, నాగార్జునసాగర్ ఎడమకాలువ ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు, మండల టి.డి.పి. అధ్యక్షులు దయాల రాజేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పుట్టా సురేష్, కార్యనిర్వాహక కార్యదర్శి మొవ్వా వేణుగోపాల్, ఎం.పి.టి.సి. సభ్యులు పుసులూరి లక్ష్మీనారాయణ, పి.ఎ.సి.ఎస్. మాజీ అధ్యక్షులు తుమ్మల దశరథరామయ్య, ఎం.పి.సి.ఎస్. అధ్యక్షులు మొవ్వా శ్రీనివాసరావు, గ్రామ టి.డి.పి. నాయకులు కసుకుర్తి అర్జునరావు, బెజవాడ వెంకట కృష్ణారావు, కనకవల్లి శేషగిరి రావు, కసుకుర్తి వేణుబాబు, బత్తిన గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీ హాస్టలలో విద్యార్థినీలకు మౌలిక వసతులు కల్పించాలి : మల్లెల ప్రసాద్




గుంతకల్లు ప్రతినిధి -పల్లె రామాంజనేయులు జూన్ 26 (శుభోదయం న్యూస్): కేజీబీవీ వసతి గృహాల్లో విద్యార్థినీలకు మౌలిక వసతులు కల్పించాలనిప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల ప్రసాద్ డిమాండ్ చేశారు ఈ మేరకు కణేకల్ మండలం ఎమ్మార్వో కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా పీ.డీ.ఎస్.యూ జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల ప్రసాద్ మాట్లాడుతూఅనంతపురం జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి కేజీబీవీ లో 6,7,8,9 వ తరగతులకు సీట్లు సంఖ్య పెంచాలి. ఎందుకంటే పేద మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఎక్కువ గా ఉన్నారు. చాలా మంది విద్యార్థినీలు హాస్టల్లో ఉండి చదువుకోగలుగుతున్నారు. కావున 6వ తరగతి కు సీటు అప్లై చేసిన కొంత మందికి విద్యార్థినీలకు మాత్రమే సీట్లు రావడం జరుగుతుంది. అదే విధంగా 6,7,8,9 వ తరగతులకు సీట్లు పెంచాలని అనంతపురం జిల్లా కలెక్టర్ ని కోరుతున్నాము. కేజీబీవీ లో కొన్ని చోట్ల తరగతి గదులు లేక విద్యార్థులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు, అదనపు తరగతి గదులు కూడా ఏర్పాటు చేయాలి.కే.జీ.బీ.వి లో సీట్లు పెంచడం వల్ల పేద మధ్య తరగతి విద్యార్థులు చదువుకోగలుగుతారు. కాబట్టి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో చదువుకోవడానికి ఎక్కువ మంది విద్యార్థినీలు మొగ్గ చూపుతారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నిలిచిపోయిన నాడు, నేడు పనులను త్వరతగిన పూర్తి చేయాలి. కేజీబీవీ విద్యార్థులకు ట్రంకు పెట్టెలు,యూనిపామ్ బట్టలు,ప్లేట్లు, బెంచీలు, కుర్చీలు, టేబుల్ ఏర్పాటు చేయాలి. పెండింగ్ లో ఉన్నటువంటి కాంపౌండ్ వాల్, బిల్డింగ్ పనులు, పెయింటింగ్, వైరింగ్, టైల్స్, మరుగుదొడ్లు, తాగడానికి మంచి నీరు,వీటిని త్వరతగితిన పూర్తి చేయాలి, కేజీబీవీ లో ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా సీట్ల సంఖ్యను పెంచాలి. కొన్ని చోట్ల కేవలం సీ.ఈ.సీ గ్రూప్ మాత్రమే ఉంది, కాబట్టి ఈ విద్యా సంవత్సరంలో ఎంపీసీ,బైపిసి, సిఇసి, హెచ్ సి, ఈ గ్రూపులను కేజీబీవీ లో అమలు చేయాలి, లేని పక్షంలో ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమానికి శ్రీకరం చుడుతామని ఈ కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం, ఈ కార్యక్రమంలో పీ.డీ.ఎస్.యూ జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల ప్రసాద్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సిసిఆర్సి కార్డుల అవగాహన సదస్సు




దోర్నాల మండల రిపోర్టర్ - ఆవులయ్య (శుభోదయం న్యూస్): ప్రకాశం జిల్లా దోర్నాల మండలం ఈ రోజు అనగా తేదీ:25.06.2025 న గౌరవ సంయుక్త కలెక్టర్ గారి ఆదేశాలు అనుసరించి పంట సాగు హక్కుదారు పత్రాలపై (%జజ=జ% కార్డ్స్) మండల స్థాయిలో రెవెన్యూ మరియు వ్యవసాయ శాఖల గ్రామ స్థాయి సిబ్బందికి అవగాహన కార్యక్రమము నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి,అధ్యక్షత వహించి రెవెన్యూ అధికారులకు మరియు గ్రామ సహాయకులకు పలు సూచనలు ఇచ్చారు. పంట సాగుచేసే భూ యజమానులకు సమానంగా కౌలు రైతులకు కూడా ప్రభుత్వం అందించే సబ్సిడీ ఫలాలు అనగా అన్నదాత సుఖీభవ, పంటల బీమా మరియు ఇన్పుట్ సబ్సిడీ మొదలైన పథకాలను అందించడమేనని తెలియజేసారు.ముందుగా గ్రామ వ్యవసాయ మరియు ఉద్యాన సహాయకులు పెద్ద ఎత్తున రైతుల్లో కార్డులు ఇస్తున్నట్లు ప్రచారం చేయవలెను. కార్డులు పొందడానికి దిగువ తెలిపిన 4 స్టెప్స్ ను విధంగా ఫాలో అవ్వాలని తెలిపారు. ఫారం 1 ముందుగా కౌలు చేసే రైతులు భూ యజమాని య్నొక్క పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు తో పాటుగా అలాగే కౌలు రైతు కూడా తన ఆధార్ కార్డు మరియు పాస్ పార్ట్ సైజ్ ఫోటోను ఫారం 1 కి జత చేసి దానితో పాటు భూ యజమానికి కౌలుదారునకు మధ్య 10 రూపాయల స్టాంప్ మీద పరస్పర ఒప్పందం కుదుర్చుకున్నట్లు వ్రాసుకున్న అంగీకార పత్రాన్ని కూడా జతచేసి గ్రామ రెవెన్యూ అధికారి గారికి దరఖాస్తు చేసుకోవాలి. ఫారం 2గ్రామ రెవిన్యూ అధికారులు కౌలు రైతు ఇచ్చిన ఫారం %×% వివరాలను పరిశీలించి ఫారం %×% లో ఉన్న విషయాలు వాస్తవమని నిర్ధారించుకున్న తరువాత వారి లాగిన్ లో కౌలు రైతుల వివరాలు, భూ యజమాని య్నొక్క పొలం వివరాలను నమోదు చేసి కార్డు మంజూరు చేయటం జరుగుతుంది. మంజూరు చేసిన %జజ=జ% కార్డు పూర్తి వివరాలను గ్రామ రెవెన్యూ అధికారులు ఫారం లో




నమోదు చేసుకుని కౌలు రైతుకి %జజ=జ% కార్డు సదరు కౌలు రైతుకి అందజేస్తారు. ఫారం 3కార్డు తీసుకున్న తరువాత కార్డు వివరాలను గ్రామ వ్యవసాయ ఉద్యాన సహాయకులు తప్పనిసరిగా గ్రామ స్థాయిలో ఫారం రిజిస్టర్ నందు నమోదు చేసుకోవలెను. అలాగే కౌలు రైతులకు ఎలాంటి ప్రభుత్వ పథకాలు అందించినా ఇదే రిజిస్టర్ నందు నమోదు చేసుకోవలెను. ఫారం 4కౌలు రైతులలో అర్హత ఉండి ఎవరైనా కార్డులు పొందని వారు ఎవరైనా ఉన్న యెడల వారి పూర్తి వివరాలతో తహసీల్దార్ గారికి దరఖాస్తు చేసుకుని నా వివరాలను పరిశీలించి నాకు %జజ=జ% కార్డు మంజూరు చేయమని అప్పీల్ చేసుకోవచ్చును. ఫారం 5భూ యజమానులలో ఎవరైనా మాకు తెలియకుండా మా అనుమతి లేకుండా మా భూమి వివరాలను పలకరించి వేరే రైతులకు సీసీర్క్ కార్డు మంజూరు చేసారు , అందువలన పూర్తి వివరాలు పరిశీలించి సదరు %జజ=జ% కార్డును క్యాన్సిల్ చేయగలరని తహసీల్దార్ గారికి అప్పీల్ చేసుకోవచ్చును.ఈవిధంగా సీసీ ఆర్ సి కార్డులు గురించి కౌలు రైతులకు అవగాహన కల్పించి ప్రభుత్వ ఉద్దేశాల ప్రకారం వారికి సకాలంలో పంట రుణాలు ఇప్పించేలా చేయాలని కోరారు. జరుగుమల్లి మండలానికి 962 కార్డులు చేయాలని లక్ష్యం నిర్దేశింపబడినట్లు తెలిపారు.రైతు సోదరులు ఈ కౌలు కార్డులు పొంది సద్వినియోగ పరచుకోవాలని తెలిపారు.కార్యక్రమానికి మండల తహసీల్దార్ శ్రీ %జన% అశోక్ కుమార్ రెడ్డి గారు మరియు మండల వ్యవసాయ అధికారి డి. జవహర్ లాల్ నాయక్,గ్రామ రెవెన్యూ అధికారులు మరియు గ్రామ సహాయకులు పాల్గొన్నారు.అలాగే ఈ రోజు అయినముక్కల మరియు దోర్నాల 1 రైతు సేవా కేంద్రం లో వ్యవసాయ శాఖ వారు పొలం పిలు స్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో వ్యవసాయ అధికారి రైతులకు వ్యవసాయ శాఖ లో అమలుఅవుతున్న పథకాల గురించి మరియు ప్రత్యామ్నాయ పంటలపై మరియు ప్రకృతి వ్యవసాయం పై రైతులకు అవగాహనా కల్పించారు. ఈ కార్యక్రమం లో చైతన్య కుమార్, %ఙూజచీఖీ% సిబ్బంది పాల్గొన్నారు.


## మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం



గుంతకల్లు ప్రతినిధి - పల్లె రామాంజనేయులు జూన్ 26 (శుభోదయం న్యూస్): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి మున్సిపల్ కార్యాలయం వద్ద దీక్షలు చేపట్టిన నేపథ్యంలో బుధవారం టిడిపి నాయకులు బండారు ఆనంద్ ఆమ్లెట్ మస్తాన్ యాదవ్ సుధాకర్ రామాంజనేయులు (అంజి) దీక్ష శిబిరాన్ని సందర్శించి మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను ఎమ్మెల్యే ,ఎంపీద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా కార్మికులకు హామీ ఇచ్చారు ఈ దీక్షలో జేఏసీ జిల్లా అధ్యక్షుడు సూరి పాల్గొన్నారు.

## నంద్యాల పట్టణ అభివృద్ధిపై సమీక్ష సమావేశం.





నంద్యాల రిపోర్టర్/ మోహన్ (శుభోదయం న్యూస్ ): నంద్యాల మున్సిపల్ కమిషనర్ తో జూన్ 25వ తేదీ బుధవారం నాడు సమీక్ష సమావేశం నిర్వహించిన మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్.నంద్యాల మున్సిపల్ కమిషనర్ తో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ తన కార్యాలయం నందు నంద్యాల పట్టణ అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాల అభివృద్ధి ధ్యేయంగా ముందుకెళ్లాలని సూచించారు.

## గన్నవరంలో ఈ నెల 27 న మహాత్మా గాంధీ, స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహాల ఏర్పాటుకు శంకుస్థాపన





గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ - సురేష్ (శుభోదయం న్యూస్) : గన్నవరం నడిబొడ్డున ఉన్న గాంధీ బొమ్మ సెంటర్లో జాతిపిత మహాత్మా గాంధీ, తెలుగు వారి ఆరాధ్య దైవం స్వర్గీయ ఎన్టీఆర్ ల నూతన కాంస్య విగ్రహాల ఏర్పాటుకు శంకుస్థాపన చేయనున్నట్లు ఎండివో స్వర్ణలత తెలిపారు. ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు గన్నవరం గాంధీ బొమ్మ సెంటర్ నుండి పోలీస్ స్టేషన్ వరకు రహదారి విస్తరణ చేపట్టిన సంగతి పాఠకులకు తెలిసిందే. రహదారి విస్తరణలో భాగంగా గాంధీ బొమ్మ సెంటర్ ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు ఎన్టీఆర్ మహాత్మా గాంధీ విగ్రహాలను పక్కకు జరిపి కాంస్య విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. గాంధబొమ్మ సెంటర్లో ఈ విగ్రహాలకు దిమ్మల నిర్మాణానికి నెల 27వ తేదీ ఉదయం 9:30 గంటలకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చేతుల మీదుగా శంకుస్థాపన నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. గన్నవరం నియోజకవర్గ ప్రతిష్టను మరింత ఇనుమడింపజేసే విధంగా ఈ విగ్రహాల ఏర్పాటును అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో గన్నవరం నియోజకవర్గ ప్రజలు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు ప్రతి ఒక్కరూ పాల్గొనవలసిందిగా టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు.

## గాన కోకిల కొండల స్వామికి ఘన సన్మానం ఏకశిర నరసింహారావు చాపల మార్కెట్




(శుభోదయం న్యూస్) : కంఠస్వరంతో పిలిస్తే పలికే దైవ స్వరూప గానం మధురంగా పాడే కొండల స్వామికి కర్లపాలెం మండలం బిసి ఎస్సి ఎస్టి మైనార్టీ నాయకులకు, పూలమాలలతో దుశాలవాలతో ఘనంగా సన్మానించారు.

## బీసీ నేత కొండల స్వామి గానం మధురం ఘనంగా సన్మానించిన బీసీ జనసైనికులు నరసింహారావు



(శుభోదయం న్యూస్) : బాపట్ల జిల్లా కర్లపాలెం బీసీ నేత కొండల స్వామి రఘుకుల తిలకా రఘురామచంద్ర అనే పాట అన్ని కంట్రీల్లో కూడా ఎంతో అద్భుతంగా చూడటం కర్లపాలెం కి గర్వకారణమని జనసైనికులు బిసి రాష్ట్ర నాయకులు చిరంజీవిలా నరసింహారావు అన్నారు ఈ సందర్భంగా కొండల స్వామిని పూలమాలలతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## కొండల స్వామిని ఘనంగా సన్మానించిన బీసీ దివ్యాంగుల నాయకులు



(శుభోదయం న్యూస్) : బాపట్ల జిల్లా కర్లపాలెం:గాన కోకిల కొండల స్వామిని ఘనంగా సన్మానించిన దివ్యాంగుల రాష్ట్ర సంచార జాతుల నాయకులు చల్లా రామయ్య దివ్యాంగుల సీనియర్ నాయకులు నర్రా రమేష్ తదితరులు.

## పేకాట ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకున్న వన్ టౌన్ సిఐ మనోహర్



గుంతకల్లు ప్రతినిధి - పల్లె రామాంజనేయులు జూన్ 26 (శుభోదయం న్యూస్): పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని బుధవారం వన్టౌన్ సిఐ మనోహర్ ఆధ్వర్యంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు వన్ టౌన్ సిఐ మనోహర్ కథనం మేరకు పట్టణంలోని ప్రశాంతినగర్ చివర ధోబి ఘాట్ సమీపంలో ఓ చెట్టు కింద కొద్దిమంది వ్యక్తులు నగదు పెట్టి జూదమాడుతున్నారన్న సమాచారం అందడంతో ఆయన తన సిబ్బందితో కలిసి పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు వారి నుంచి 74,500 నగదు స్వాధీనం చేసుకున్నారు కాగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డిఎస్పి సూచనల మేరకు అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని వన్టౌన్ సిఐ మనోహర్ హెచ్చరించారు.

## శ్రీశ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో అన్నదాన వితరణ చేసిన...

### విశ్రాంత రైల్వే పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ సుధాకర్



గుంతకల్లు ప్రతినిధి - పల్లె రామాంజనేయులు జూన్ 26 (శుభోదయం న్యూస్) : శ్రీ శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి దేవాలయంలో జేష్ఠ అమావాస్య సందర్భంగా బుధవారం రైల్వే ఉన్నత పాఠశాల విశ్రాంత వైస్ ప్రిన్సిపాల్ సుధాకర్ తన తల్లిదండ్రు లు చిన్నయ్య రాజమ్మ ఆశీస్సులతో ఒక్కరోజు అన్నదానం కు 5116 వేల రూపాయలను వితరణ చేశారు ఈ కార్యక్రమంలో దేవాలయ వ్యవస్థాపకుడు తలారి పరశురాం దంపతులు పాల్గొన్నారు.

## ఎమర్జెన్సీ చీకటి రోజులు

### ఎస్కేపి ప్రభుత్వం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ లక్ష్మయ్య



గుంతకల్లు ప్రతినిధి - పల్లె రామాంజనేయులు జూన్ 26 (శుభోదయం న్యూస్): ఎమర్జెన్సీ రోజులు చీకటి రోజులని ఆ రోజు ఎంతోమంది నిర్దాక్షిణ్యంగా జైల్లో మగ్గిపోయారని ఎస్కేపి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ లక్ష్మయ్య పేర్కొన్నారు బుధవారం శ్రీ కన్యకా పరమేశ్వరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు "సంవిధాన్ హత్య దివస్" కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, వైస్ ప్రిన్సిపల్ శర్మ,చరిత్ర అధ్యాపకులు డాక్టర్ గోపినాయక్ మాట్లాడుతూ మనదేశంలో 1975 -77 సంవత్సరాలలో దాదాపు 21నెలల పాటు దేశవ్యాప్తంగా ఎమర్జెన్సీ విధించడం జరిగిందనీ, ఆ సమయంలో దేశ వ్యాప్తంగా వేలాది మందిని అరెస్టు చేసి జైలలో ఉంచడం జరిగింది. జూన్ 25 రాత్రి దేశ ప్రజలు నిద్రలో ఉండగానే ఎమర్జెన్సీని ప్రకటించారు ఒక్క రోజులోనే దేశం అంతా పెద్ద జైలుగా మారిపోయింది. ముఖ్యంగా భారత రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులను రద్దు చేశారు. ఏక వ్యక్తి నియంతృత్వ పాలనకు దారి తీసింది. దాదాపు 21 నెలలు ఎమర్జెన్సీ తర్వాత దేశ వ్యాప్తంగా జరిగిన ఎన్నికలలో ప్రజలు విభిన్నమైనటువంటి తీర్పునిచ్చారు. ఈ సంఘటన జరిగి సరిగ్గా 50 సంవత్సరాలు గడిచిపోవడం వల్ల ప్రస్తుతం ఈ కార్యక్రమం ద్వారా సంవిధాన్ హత్య దివాస్ గురించి నేటి యువతకు అవగాహన కల్పించడం జరిగింది .ఈ కార్యక్రమంలో డాక్టర్ జనార్ధన శాస్త్రి, డాక్టర్ నాగరాజు, నారాయణ, బసవరాజు అధ్యాపక, అధ్యపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## పెన్డౌన్ నిర్వహించిన గ్రామ సర్వే ఉద్యోగులు



కనేకల్, మండల్ విలేఖరి - మాల్యం కిరణ్ కుమార్ జూన్ 26 (శుభోదయం న్యూస్): గ్రామ సర్వే ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం పెన్డౌన్ కార్యక్రమం నిర్వహించారు చాలా కాలంగా తమకు ఎన్నో సమస్యలు లేని వాటిని ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు ముఖ్యంగా గ్రామస్థాయి ఉద్యోగులకు సొంత మండలాల్లో పోస్టింగ్ ఇవ్వాలన్నారు అంతర్ జిల్లా బదిలీలను ఈ మేరకు బుధవారం వారు తాసిల్దార్ వినతి పత్రాన్నిఅందజేశారు.

## ఏజెన్సీ గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి - ఎమ్మెల్యే సూచన



బుట్టాయిగూడెం/ జీలుగుమిల్లి, (శుభోదయం న్యూస్): మండలం లోని కరాటం రంగనాయకమ్మ సామజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ నూతన నియామకం మరియు సమావేసం బుధవారం ఆసుపత్రి చైర్మన్, ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశం లో ఆసుపత్రి కి సంబందించిన అభివృద్ధి కార్యకలపాలపై చర్చించారు. అలాగే రోఘులకు కు సంబంధించి వసతులలో లోపాలుంటే ఆసుపత్రి చైర్మన్, ఎమ్మెల్యే ద్రుష్టి కి తీసుకురావాలని సూచించారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా ఏజన్సీ లోని అన్ని గ్రామాల్లో వైద్యాధికారులు పర్యవేక్షణ ఉండాలన్నారు. ప్రజా ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ద వహించి ప్రతి కుటుంబం లో అందరు ఆరోగ్యం గా ఉండేలా నాణ్యమైన వైద్యాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బంది ని కోరారు. అలాగే కూటమి ప్రభుత్వం ప్రజలకి మెరుగైన వైద్యం అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. బుట్టాయిగూడెం ఆసుపత్రి లో వైద్యులు అలాగే ఇతర విషయాల్లో పలు పిర్యాదులు వచ్చాయాని ఆ పిర్యాదులు దృష్టిలో ఉంచుకొని డాక్టర్ లు సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించాలని బుట్టాయిగూడెం ఆసుపత్రి కి వైద్యంలో వన్నె తెచ్చే విధంగా నడవాలని ఎమ్మెల్యే సూచించారు. నూతన కమిటీ లో సభ్యులు గా ఎంపీ పుట్టా మహేష్ కుమార్, కరాటం శ్రీకాంత్,



కరిమికొండ శివాజీ, డాక్టర్ బి. వసుందర, కరాటం జయ శిరీష, పంచాయతీ కార్యదర్శి ఉప్పె దేవప్రియుడు, ఎంపిడివో కె. జ్యోతి జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి, జనసేన వీర మహిళ నడింపల్లి శివ గంగా భవాని తదితరులు పాల్గొన్నారు.

## : మాజీ సర్పంచ్ అల్లం మర్రెడ్డి మృతి

### - నిస్వార్థ ప్రజాసేవకుడని కొనియాడిన ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి




రెంటచింతల, మండల రిపోర్టర్ -శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్) : రెంటచింతల గ్రామ సర్పంచ్ గా 18 ఏళ్ల పాటు ప్రజలకు సుదీర్ఘ సేవలు అందించిన నిరాడంబరుడు మాజీ సర్పంచ్ అల్లం మర్రెడ్డి(79) అనారోగ్యంతో బుధవారం ఉదయం స్వగృహంలో పరలోకప్రాప్తి చెందారు. స్వతహాగా కాంగ్రెస్ అభిమానియైన ఆయన నాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి, మాజీ మంత్రి కృష్ణారెడ్డిలతో సన్నిహిత సంబంధాలు కలిగి ఆ కుటుంబం పట్ల విధేయత కనపరిచేవారు. మృదుస్వభావ లక్షణంతో అందరి ఆదరాభిమానాలతో 1970 నుంచి 1988 వరకు వరుసగా మూడు సార్లు సర్పంచ్ గా గెలిచి వివాదరహితుడిగా మర్రెడ్డి పేరొందారు. గ్రామ ప్రజలతో మమేకమై వారి సమస్యలపై స్పందిస్తూ వారి అభిమానాన్ని చూరగొన్నారు. తన పదవీకాలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కృషి చేయడంతో పాటు లబ్ధిదారుల ఇళ్ళ పట్టాల ధృవీకరణ పత్రాల జారీకి సంబంధించిన ఫీజులన్నింటినీ తానే చెల్లించి ఉదాత్తత చాటుకొన్న ఆయన కాలనీ ఏర్పాటులో కీలకపాత్ర వహించారు. అలాగే గ్రామంలోని విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటులోనూ ఆయన కృషి దాగుంది. వర్గ వైషమ్యాలకు దూరంగా ఉండి నీతి నిజాయితీతో సర్పంచ్ గా



వివిధ పార్టీ రాజకీయ నేతలచే గౌరవవింపబడిన మర్రెడ్డి నిరాడంబర వ్యక్తిత్వం ఆదర్శప్రాయమని ఈ సందర్భంగా పలువురు గ్రామ పెద్దలు పేర్కొంటూ ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో మర్రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించగా, ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి రెంటచింతల విచ్చేసి భౌతికకాయానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసిన వారిలో సర్పంచ్ పూజల పద్మావతి, వైకాపా నేత పూజల రామయ్య,టీడీపీ నేతలు అబ్బిరెడ్డి,సుమంత్ రెడ్డి, రామకృష్ణ, సీపీఐ మండల కార్యదర్శి కేతావత్ రంగనాయకులు, కాంగ్రెస్ నేత రాగిడి ప్రతాప్ బాబు,ఆర్యవైశ్య సంఘం నేతలు ఏచూరి వెంకట సైదయ్య, ఆకుల నరసింహారావు, స్థానిక పంచాయతీ సిబ్బంది,గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పల్లెర్ల కేశవరెడ్డి, విద్యావేత్త నారాయణపురం శ్రీనివాసరావు పలువురు రాజకీయ నేతలు ఉన్నారు.

## పిడుగురాళ్ల పట్టణంలో ఎయిర్ టెల్ సంస్థ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన




పిడుగురాళ్ల, టౌన్ రిపోర్టర్ - శీనివాసరావు (శుభోదయం నూస్): ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పిడుగురాళ్ల పట్టణ సిఐ వెంకట్రావు విచ్చేసి కేక్ కట్ చేసి ఎయిర్ టెల్ సంస్థ ప్రతినిధులను అభినందించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ముందుగా ఎయిర్టెల్ సిమ్ ఖాతాదారులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలియజేస్తూఎయిర్ టెల్ సంస్థ స్పెమ్ కాల్స్ పై , ఏఐ ద్వారా కొత్త సాఫ్ట్ వేర్ ప్రారంభించి ఎయిర్టెల్ వినియోగదారులకు ఆర్థికంగా నష్టం వాటిల్లకుండా ఉండాలని సంకల్పంతో ఏఐ సాఫ్ట్వేర్ తీసుకొని రావటం అన్నారు. ఇప్పటినుండి ఎయిర్టెల్ ఖాతాదారులకు వచ్చే రాంగ్ కాల్స్ ను, ముందుగానే ఏఐ ద్వారా వినియోగదారుడుకి చేరకుండా, మా సంస్థ ముందుంటుందని తెలియజేస్తూ సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వినియోగదారులను కోరారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పట్టణ సిఐ వెంకట్రావు మరియు పట్టణ ఎస్ఐ నాగరాజు, ఎయిర్ టెల్ జోనల్ మేనేజర్ రాజేష్, మేనేజర్ నాగరాజు, టౌన్ డిస్ట్రిబ్యూటర్ ఉమామహేశ్వరరావు, మరియు కనిగిరి కోటేశ్వరరావు, ఎయిర్టెల్ మరియు సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రేషన్ దారులకు డీలర్లు సక్రమైన మార్గంలో రేషన్ పంపిణి చేయాలి

## డీలర్ల సమావేశంలో పలు సూచనులు అందచేసిన తహసీల్దార్



తనకల్లు, మండల రిపోర్టర్ రవీంద్ర (శుభోదయం న్యూస్): మండల కేంద్రంలోని స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో నూతన తహసిల్దార్ షాబుద్దీన్ అధ్యక్షతన బుధవారం డీలర్ల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. తహసిల్దార్ మాట్లాడుతూ రేషన్ పంపిణీ వ్యవస్థలో ప్రభుత్వం నిర్ణయించిన సమయాల్లో కచ్చితంగా డీలర్ అందుబాటులో ఉండి ప్రజలకు రేషన్ పంపిణీ చేయాలని, అదేవిధంగా వికలాంగులకు,



60 సంవత్సరాలు పైబడిన వృద్ధులను గుర్తించి వారి ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేయవలసిందిగా డీలర్లకు పలు సూచనలు సలహాలు అందజేయడం జరిగింది, అంతేకాకుండా డీలర్లు ప్రతి ఇంటిదగ్గర స్టాక్ బోర్డ్ ఏర్పాటు చేసుకోవాలని, ఎవరైనా అందుబాటులో లేకుండా ప్రజలను ఇబ్బంది పెట్టినట్లయితే ప్రభుత్వం తీసుకునే చర్యలకు బాధితులు అవుతారని ఈ సందర్భంగా తెలియజేశారు. అనంతరం డీలర్లు అందరూ నూతనంగా మండలానికి విచ్చేసిన తహసిల్దార్ కు పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ షాబుద్దీన్, ఆర్ ఎస్ డి టి మల్లికార్జున, సి ఎస్ డి టి వెంకటరెడ్డి, నూతన ఆర్ఐ అశోక్ కుమార్, మరియు డీలర్లు పాల్గొన్నారు.

## మండల నూతన డీలర్ల సంఘం అధ్యక్షులు ఉపాధ్యక్షుల ఎన్నిక






తనకల్లు ,మండల రిపోర్టర్ రవీంద్ర (శుభోదయం న్యూస్)మండల పరిధిలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం నూతన డీలర్ల సంఘం మండల అధ్యక్షులు కొత్తకోట గ్రామ పంచాయతీకి చెందిన డి. మంజునాథ్ ను ఉపాధ్యక్షులుగా కడపలవారి పల్లి కి చెందిన మాజీ ఎంపీటీసీ డీలర్ కడపల రెడ్డప్పరెడ్డిని డీలర్లు అందరూ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అనంతరం డీలర్లు అందరూ అధ్యక్షులకు మరియు ఉపాధ్యక్షులకు ఘనంగా సన్మానించారు. అధ్యక్షులు ఉపాధ్యక్షులు మాట్లాడుతూ:- డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలు అనేకం ఉన్నాయని, డీలర్ల సమస్యలను గుర్తించి అందరిని ఒక ఏకధాటిపై నిలబెట్టి అధికారుల దృష్టికి సమస్యలుంటే చర్చించి డీలర్ల సమస్యను పరిష్కరించడానికి నిరంతరం అందుబాటులో ఉంటామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల డీలర్లు అందరూ పాల్గొన్నారు.

## గిరిజన ముద్దుబిడ్డకు డాక్టర్ పట్టా





తనకల్లు ,మండల్ రిపోర్టర్ రవీంద్ర ( శుభోదయం న్యూస్): తనకల్లు మండలం గేమే నాయక్ తండా పంచాయితీ సర్పంచ్ మూడే ఉత్తన్న నాయక్ కుమారుడు డాక్టర్ సురేష్ నాయక్ ఎంబిబిఎస్ పూర్తి చేసి పట్టా పొందారు. గ్రామీణ తండాలో జన్మించి, ఎంబిబిఎస్ చదివి డాక్టర్ పట్టా పొందినందుకు గ్రామ పెద్దలు గిరిజన ముద్దుబిడ్డను అభినందించారు.

# కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ - రాజకీయాల్లో ఒక "టార్చ్ బేరర్"



తనకల్లు, మండల రిపోర్టర్ రవీంద్ర (శుభోదయం న్యూస్) : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ ఒక విలక్షణమైన, ప్రభావవంతమైన నాయకుడిగా నిలిచారు. ఆయన గత రెండు దశాబ్దాలుగా తెలుగుదేశం పార్టీలో నిబద్ధతతో పనిచేస్తూ, తనదైన శైలిలో ప్రజలకు చేరువవుతున్నారు. పార్టీకి, ప్రజలకు ఆయన అందిస్తున్న సేవలు, చేపట్టిన వినూత్న కార్యక్రమాలు ఆయన్ను రాజకీయాల్లో నిజమైన "టార్చ్ బేరర్"గా నిలుపుతున్నాయి.

### విపక్షంలోనూ వినూత్న పోరాటాలు

2024 ఎన్నికలకు ముందు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు, రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన "బాదుడే బాదుడు" కార్యక్రమాన్ని మొట్టమొదటగా కదిరి నియోజకవర్గంలో ఆయనే ప్రారంభించారు. ఈ కార్యక్రమం ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో కీలకపాత్ర పోషించింది. ఇది కేవలం కదిరికే పరిమితం కాకుండా, రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు విస్తరించి, పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది.

### యువగళానికి ఊపిరి పోసిన నాయకుడు




నారా లోకేష్ చేపట్టిన "యువగళం" పాదయాత్రకు రాష్ట్రవ్యాప్తంగా ఊపు తెచ్చిన నాయకులలో కందికుంట వెంకటప్రసాద్ ఒకరు. కదిరి నియోజకవర్గంలో యువగళం పాదయాత్రను అపూర్వ రీతిలో విజయవంతం చేయడంలో ఆయన తీవ్రంగా కృషి చేశారు. ఈ కార్యక్రమం ద్వారా కార్యకర్తలను ఏకతాటిపైకి తీసుకురావడంలో, వారిలో నూతనోత్తేజాన్ని నింపడంలో ఆయన పాత్ర అపారమైనది.

### కులం, మతాలకు అతీతంగా 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానం:

కదిరి నియోజకవర్గంలో రెడ్డి మరియు ముస్లిం సామాజిక వర్గాలు అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ, ఒక బీసీ సామాజిక వర్గానికి చెందిన కందికుంట వెంకటప్రసాద్ కులం, మతం తేడా లేకుండా గత 20 సంవత్సరాలుగా కేవలం తెలుగుదేశం పార్టీలోనే రాజకీయం చేస్తున్నారు. ఇది ఆయన నిబద్ధతకు, లౌకిక వాద దృక్పథానికి నిదర్శనం. అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని పోయే ఆయన గుణం ఆయన్ను ప్రజలకు మరింత చేరువ చేసింది.

### "మన ఇంటికి మన ఎమ్మెల్యే" కార్యక్రమంతో విప్లవం:

రాష్ట్రంలోనే మొదటిసారిగా "మన ఇంటికి మన ఎమ్మెల్యే" కార్యక్రమాన్ని ప్రారంభించిన ఘనత కందికుంట వెంకటప్రసాద్‌కే దక్కుతుంది. ఈ కార్యక్రమం ద్వారా ఎమ్మెల్యే స్వయంగా ప్రజల ఇళ్లకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆయన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన కేవలం మూడు వారాల తర్వాత, చంద్రబాబు నాయుడు సమీక్షా సమావేశం నిర్వహించి, ప్రతి ఒక్కరూ ప్రజలతో కలిసి మమేకమవ్వాలని పిలుపునివ్వడం కందికుంట ఆచరణాత్మక ఆలోచనలకు నిదర్శనం.

### అవినీతి రహిత నాయకుడు:

ప్రస్తుతానికి రాయలసీమ వ్యాప్తంగా చూసుకుంటే, ఇప్పటివరకు ఒక్క అవినీతి ఆరోపణ కూడా లేని ఏకైక ఎమ్మెల్యేగా కందికుంట వెంకటప్రసాద్ గుర్తింపు పొందారు. ఇది ఆయన వ్యక్తిత్వానికి, నిస్వార్థ సేవకు నిదర్శనం. ప్రజల పట్ల ఆయనకున్న అంకితభావం, పారదర్శకత ఆయనను ఒక విశ్వసనీయ నాయకుడిగా తీర్చిదిద్దాయి.మొత్తంగా, కందికుంట వెంకటప్రసాద్ కేవలం ఒక రాజకీయ నాయకుడిగా కాకుండా, ప్రజా సమస్యలను అర్థం చేసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేసే ఒక నిజమైన లిటార్చ్ బేరర్‌లిగా నిలుస్తున్నారు. ఆయన ప్రస్థానం అనేక మందికి ఆదర్శప్రాయం. అందుకే బహుశా రానున్న రోజుల్లో ఆయన పడ్డ కష్టానికి ప్రతిఫలం వస్తుందనే ఆశ కార్యకర్తల్లో బలంగా నాటుకు పోయింది.

## బయన్నపల్లిలో డ్రైనేజీ నిర్మాణానికి భూమి పూజ.



లేపాక్షి మండల రిపోర్టర్ అమరేష్ (శుభోదయం న్యూస్ ) మండల పరిధిలోని కంచి సముద్రం గ్రామపంచాయతీ పరిధిలోని బయన్నపల్లి గ్రామంలో డ్రైనేజీ నిర్మాణానికి జడ్పీ నిధులు ఐదు లక్షలు రూపాయల మంజూరయ్యాయి. సర్పంచ్ గంగ లక్ష్మి, టిడిపి నాయకులు నాగరాజు (గ్రీన్ పార్క్ ), చంద్రశేఖర గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు బయనపల్లి లో డ్రైనేజీ అవసరాన్ని నాయకులు దృష్టికి తీసుకురాగా అందుకు అవసరమైన నిధులను జడ్పీ నుంచి మంజూరు చేయించారు ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వేరుశనగ విత్తన శుద్ధి పై అవగాహన కల్పించిన మండల వ్యవసాయ అధికారి శ్రీలక్ష్మి.




లేపాక్షి మండల రిపోర్టర్ అమరేష్ (శుభోదయం న్యూస్) లేపాక్షి మండలం చోళ సముద్రం, బిసల మానేపల్లి గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో " పొలం పిలుస్తుంది "కార్యక్రమం బుధవారం జరిగింది భూసార పరీక్షలతో కలిగిన ఉపయోగాలు చేయించే విధానాన్ని వివరించారు వేరుశనగ విత్తన శుద్ధి పై అవగాహన కల్పించారు. అంతర పంటల యాజమాన్యం సస్య రక్షణ ఎరువుల వినియోగం మొక్కజొన్న పంట యాజమాన్య పద్ధతులు డ్రోన్ స్ప్రేర్ ఉపయోగాలు గురించి తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది రైతుల తదితరులు పాల్గొన్నారు.

## లేపాక్షిలో సచివాలయం సిబ్బంది నిరసన.



లేపాక్షి మండల అమరేష్ రిపోర్టర్ (శుభోదయం న్యూస్ ) లేపాక్షి మండల పరిధిలోని సచివాలయాల ఉద్యోగులు ఎంపీడీవో కార్యాలయం ముందు బుధవారం నిరసన వ్యక్తం చేశారు తమకు పదోన్నతులను కల్పించలేదన్నారు సీనియార్టీ జాబితా ఇంతవరకు విడుదల చేయలేదని చెప్పారు సక్రమంగా ఖాళీలను చూపు లేదన్నారు ఇన్ని సమస్యలు ఉండగా సచివాలయాల ఉద్యోగులను ఎలా బదిలీ చేస్తారని ప్రశ్నించారు అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో నరసింహమూర్తికి అందజేశారు . ఈ కార్యక్రమంలో మండల పరిధిలో ఉన్న సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎలక్ట్రికల్ సేఫ్టీ వీక్ సందర్భంగా "స్మార్ట్ ఎనర్జీ - సేఫ్ నేషన్" అంశంపై వారం రోజులపాటు కార్యక్రమాలు




హైదరాబాద్, శుభోదయం న్యూస్: చైతన్య భారతీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ , హైదరాబాద్ లోని ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో జూన్ 26 నుండి జూలై 2, 2025 వరకు "స్మార్ట్ ఎనర్జీ సేఫ్ నేషన్" అనే అంశంపై ఆన్ లైన్ లో షార్ట్ టెర్మ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ను నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా సౌర విద్యుత్, ఎలక్ట్రిక్ వాహనాలు , స్మార్ట్ గ్రిడ్స్ వంటి ఆధునిక విద్యుత్ వ్యవస్థలను సురక్షితంగా నిర్వహించడానికి అవసరమైన జాగ్రత్తలు, పరిజ్ఞానాన్ని విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులు మరియు పరిశ్రమలకు చెందినవారు తెలుసుకోవడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు మరియు పరిశ్రమ నిపుణులు పాల్గొనవచ్చు. ఎటువంటి నమోదు రుసుము లేదు. ఆసక్తిగల వారు ఈ లింక్ ద్వారా నమోదు చేసుకోవచ్చు: కళాశాల వెబ్ సైట్ ను చూడవచ్చుని కళాశాల పి ఆర్ ఓ డాక్టర్ జి ఎన్ ఆర్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రసంగించనున్న ముఖ్యవక్తలు: ఇంజి. టి. సూర్యచంద్ర శేఖర్, ఉప విద్యుత్ తనిఖీ అధికారి, ఇంజి. జి. సంతోష్ స్వరూప్, భారత్ స్మార్ట్ సర్వీసెస్, శ్రీ ఏ.ఆర్. వెంకిట రామన్, మాజీ ఈ ఈ - వేర్‌హౌస్ లిమిటెడ్, ఇంజి. ఏ. శివయ్య, లీడ్ ఆడిటర్, డా. పి. లక్ష్మీ నారాయణ, పబ్లిక్ హెల్త్ ఫిజిషియన్ మరియు డా. సీ.బి.వి. సుబ్బారాయుడి, ప్రొఫెసర్. ఈ కార్యక్రమంను డా. బి. సురేష్ కుమార్ మరియు డా. జి. సురేష్ బాబు సమన్వయకర్తలుగా నిర్వహిస్తుండగా, డా. చి. వి. కృష్ణారెడ్డి మరియు డా. సుకాంత్ సహ-సమన్వయకర్తలుగా పని చేస్తున్నారు.

## భవనిర్మాణ కార్మికుడు కల్కూరి అంజయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి : సిఐటియు



వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని వెల్వర్తి గ్రామానికి చెందిన భవనిర్మాణ కార్మిక సంఘం వెల్వర్తి గ్రామ శాఖ అధ్యక్షులు కల్కూరి అంజయ్య అనారోగ్యంతో మరణించడం జరిగింది. భవనిర్మాణ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో సంతాపం తెలియజేస్తూ పుష్పగుచ్చాల నుంచి నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం మండల గౌరవ అధ్యక్షులు తుర్కపల్లి సురేందర్ మరియు భవనిర్మాణ కార్మిక సంఘం మండల కార్యదర్శి రాధారపు మల్లేశం మాట్లాడుతూ, భవనిర్మాణ కార్మికులు కల్కూరి అంజయ్య గత 35 సంవత్సరాల నుండి భవ నిర్మాణ కార్మికుడిగా పని చేసుకుంటూ, అనేక ప్రమాదాల గురి కావడం జరిగిందని గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మరణించడం బాధాకరమని అన్నారు.అంజయ్య భవనిర్మాణ కార్మిక సంఘం గ్రామ శాఖ అధ్యక్షులు గత కొంతకాలంగా పనిచేస్తూ కార్మికులకు అనేక సేవలు అందించారని వారు లేకపోవడం కార్మికులకు నష్టం జరిగింది అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అంజయ్య కుటుంబానికి 5 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు సింగారం వెంకటేశం మండల నాయకులు ఉక్కుర్తి స్వామి మొగిలిపాక ఎల్ల స్వామి చేగురి నగేష్ కలిమిరా సుదర్శన్ ఉ కుర్తి నాగయ్య కల్కూరి బాలరాజు పోలె పాక శంకర్, క లుకూరిశంకరయ్య, బొజ్జ కిష్టయ్య, చెమడాల నర్సింగ్,ఉక్కుర్తి శీను, గుర్రాల రాములు, తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేసిన కాంగ్రెస్ నాయకులు



వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని గుర్నాథ్ పల్లి,మొగిలిపాక, గోపరాజుపల్లి, గ్రామాల్లోని బాధితులకు స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సౌజన్యంతో విడుదలైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బుధవారం మండల పార్టీ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి ఆధ్వర్యంలో అందజేశారు.ఈ కార్యక్రమంలో చెరుకు శివయ్య గౌడ్,బత్తిని సహదేవ్ గౌడ్,పులిపలుపుల రాములు,చిలుగూరిసత్తిరెడ్డి,చలిగంజి బిక్షపతి,గుర్నాథ్ పల్లి భాస్కర్, బంధారపు నరసింహ, మరియు ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ ఎన్నికలలో బీసీలకు 42% రిజర్వేషన్ ఇవ్వాలి-పల్లగొర్ల మోదీరాందేవ్ యాదవ్



వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):పంచాయతీ ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి అసెంబ్లీలో చేసిన బిల్లుకు గవర్నర్ ద్వారా జీవో తీయాలన్నారు. రామన్నపేట సుభాష్ సెంటర్లో నిర్వహించిన సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన హామీ ప్రకారం పంచాయతీ ఎన్నికలలో బీసీలకు 42% రిజర్వేషన్లు ఇస్తామన్నారు,అలాగే కామారెడ్డి డిక్లరేషన్ హామీను అమలు చేయాలి లేకుంటే యుద్ధమే ఆర్ కృష్ణన్న ఆధ్వర్యంలో రాష్ట్రాన్ని అగ్నిగుండం చేస్తామన్నారు,60 శాతం ఉన్న బీసీలు రాజకీయంగా 12% దాటలే ఇదెక్కడి ప్రజాస్వామ్యం ఇది అటవీక న్యాయం ఎమ్మెల్యేలు మీరే ఎంపీ లుమీరే మంత్రులు మీరే ముఖ్యమంత్రి మీరే బీసీలు సర్పంచులు ఎంపీటీసీ జెడ్పిటిసిలు అయితే గిట్ల ఓర్వలేరా బీసీ రిజర్వేషన్ పెంచుటకు న్యాయపరమైన చిక్కులు ఎలాంటివి లేవన్నారు రాజ్యాంగం లోని 253 డి 6 టి 6 ప్రకారం స్థానిక సంస్థల్లో రాష్ట్ర ప్రభుత్వమే రిజర్వేషన్లు ఖరారు చేసుకోవచ్చని ఉన్న బీసీలు రాజకీయంగా ఎదగకూడదనే ఉద్దేశంతోనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తుందన్నారు. పక్క రాష్ట్రం బీహార్లో 69 శాతం తమిళనాడులో 70% అమలవుతుంటే ఇక్కడ ఎందుకు సాధ్యం కాదన్నారు హామీలు ఇచ్చి తప్పించుకుందామంటే మరో తెలంగాణ ఉద్యమాన్ని చూస్తారు, తెలంగాణ ఉద్యమంలో కాంగ్రెస్ లీడర్లను బట్టలు ఇప్పించి ఉరికించి కొట్టింది మరువకురి మల్లాది రిపీట్ కావొద్దు అంటే బీసీలకు 42% రిజర్వేషన్స్ ఇవ్వాలి కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే బీసీ స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో తీర్మానం చేసి చేతులు దులుపుకోవాలని కాంగ్రెస్ పెద్దలు చూడటం అత్యంత దుర్మార్గం అన్నారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం కులగణన చేసి,స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచకుండా ఎన్నికలకు వెళ్తే బీసీలు కాంగ్రెస్ కు తగిన బుద్ధి చెబుతారని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.దేశ వ్యాప్తంగ బడుగు బలహీన వర్గాలకు రాజకీయ అవకాశాలు కల్పిస్తామని రాహుల్ గాంధీ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో చెప్పినందుకే కాంగ్రెస్ పార్టీకి 99 ఎంపీ సీట్లు దక్కిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.గతంలో బీసీలను మోసం చేసినందుకే దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారానికి దూరమైందన్న అభిప్రాయం వ్యక్తం చేశారు.ఇప్పుడు కూడా మరోసారి బీసీలను మోసం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చూస్తున్నారని, అదే జరిగితే కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో పుట్టగతులు లేకుండా పోతుందని అన్నారు. ఇప్పటికైనా అసెంబ్లీలో పెట్టిన బీసీ బిల్లుకు జీవో తీసి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు.కులగణనలో దేశానికి ఆదర్శంగా నిలిచిన బీహార్ రాష్ట్రాన్ని మోడల్ గా తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు.ఏది ఏమైనా కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచైనా కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేసేలా బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు వచ్చేలా కుల సంఘాలన్నీ ఏకతాటి మీదిగా ఉండి పని చేయాలన్నారు.ఈ సమావేశంలో బీసీ యువజన సంఘం ఉమ్మడి నల్గొండ జిల్లా కన్వీనర్ ఎడ్ల మహాలింగం, మహిపాల్ రెడ్డి, మోట నవీన్ కుమార్, పులిగిల్ల కృష్ణయ్య, ఆకిటి శివ,మోటి శివ, సాయి,మల్లేష్, విష్ణుమూర్తి,శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## బీర్కూర్ పెట్రోల్ బంక్ లో ఘరానా మోసం.



బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్):కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండల కేంద్రంలో ఈ నెల 22 వ తారీకు ఒక గుర్తు తెలియని వ్యక్తి నీలి కలర్ ఎన్ఎస్ పల్సర్ ద్విచక్ర వాహనం నంబర్ ప్లేట్ లేని బండి పైన బీర్కూర్ లోని ఓ పెట్రోల్ బంక్ కి వచ్చి ఫోన్ పే చేస్తా డబ్బులు కావాలి హాస్పిటల్ కి వెళ్ళాలి అని చెప్పి ఫేక్ ఫోన్ పే ద్వారా డబ్బు కొట్టి నగదు 9 వేల రూపాయల నగదు తీసుకొని పారిపోయాడు. సదరు మోసపోయిన వ్యక్తి తాను మోసపోయినట్టు గ్రహించిన యజమానికి విషయం తెలియచేసి పోలీస్ స్టేషన్ లో కంప్లైంట్ చేసినట్టు తేలిపోయారు ఈ విషయాని సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా కామారెడ్డి నుండి ఓ పెట్రోల్ బంక్ నుండి స్పందించి అదే వ్యక్తి అదే ద్విచక్ర వాహనం పైన వచ్చి సిరిసిల్ల రోడ్డు లోని ఓ నూతన పెట్రోల్ బంక్ లో 17 వేల నగదు ఫేక్ ఫోన్ పే కొట్టి నగదు తీసుకున్నట్టు సదరు బంక్ వాలు సమాచారం అందించారు. ఇలానే మరి కొందరు కూడా స్పందించారు.

## ఇరువురు మహిళలకు రక్తదానం చేసిన లెజెండ్ బ్లడ్ ఆర్గనైజేషన్





గుంతకల్లు ప్రతినిధి - పల్లె రామాంజనేయులు జూన్ 26 (శుభోదయం న్యూస్) : లెజెండ్ బ్లడ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఇరువురు మహిళలకురక్తదానం చేశారు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉల్లిగమ్మ మహిళకు ఓ పాజిటివ్ రక్తం అవసరం కాగా మరియు షబానా అనే మహిళకు ఏబి పాజిటివ్ రక్తం అవసరం కాగా గుంతకల్లు లెజెండ్ బ్లడ్ ఆర్గనైజేషన్ ముఖ్య సభ్యులు రక్తదాతలు ఒకరు ఏబీ పాజిటివ్ కోదండ రాముడు ఓ పాజిటివ్ రాజేష్ స్పందించి వెంటనే ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంకు కువచ్చి రక్తదానం చేశాడు మరియు గోపి బ్లడ్ బ్యాంకు కి వచ్చి రక్తదానం చేశాడు సకాలంలో స్పందించిన రక్తదాతలకి మా లెజెండ్బ్లడ్ఆర్గనైజేషన్తరపున నిండు నూరేళ్లు ఆయుష్ ఆరోగ్యం బాగుండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము. ఓ పాజిటివ్ రాజేష్ 20వసారి రక్తదానం చేశాడు మరియు కోదండ రాముడు ఎనిమిదో సారి రక్తదానం చేశారు రక్తదానంలో పాల్గొన్న లెజెండ్ మస్తాన్.

## కల్వర్టు పనులు వెంటనే పూర్తి చేయాలని బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో ధర్నా



వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ వలిగొండ మండల శాఖ అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్ ఆధ్వర్యంలో మూసి భీమ లింగం కాల్వ కల్వర్టు పనుల కోసం సుంకిశాల,వలిగొండ గ్రామాల మధ్యన తవ్వకాలు జరిపి ఇంతవరకు పనులు పూర్తి చేయక, కాల్వ కింద ఆయకట్టు రైతులకు నీటిని విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్న అధికారుల తీరు పట్ల మండల శాఖ తరపున రైతులు,భారతీయ జనతా పార్టీ నాయకులు సంయుక్తంగా ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి జిల్లా పార్టీ అధ్యక్షులు శ్రీ ఉట్కూరి అశోక్ గౌడ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ఈ కాంగ్రెస్ ప్రభుత్వం,ఈ అధికారులు కలిసి రైతులను మోసం చేస్తూ,రైతులు వేసుకున్న విత్తనాలు, నార్లు ఎండిపోతు రెండు కార్తులు వెళ్లిన ఇంతవరకు రైతు పంట వేసుకోకుండా,నీటిని విడుదల చేయకపోవడం చాలా దారుణం అని,స్థానిక ఎమ్మెల్యే కనీసం స్పందించకపోవడం సిగ్గుచేటని తీవ్రంగా విమర్శించడం జరిగింది. అధికారులతో మాట్లాడినప్పుడు వారు ఈ నెల 30వ తారీకు వరకు గడువు ఇవ్వడం జరిగిందని, గడువు లోపట పనులు పూర్తి చేసి నీటిని విడుదల చేయని యెడల జిల్లా నీటిపారుదల కార్యాలయాన్ని రైతుల పక్షాన భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ముట్టడిస్తామని తీవ్రంగా హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్ రెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు సి.ఎన్.రెడ్డి,ఏలె చంద్రశేఖర్,బంగారపు లింగస్వామి,బిజెపి జిల్లా నాయకులు కొప్పుల యాదిరెడ్డి, ఎలిమినేటి వెంకటేశం, రాచకొండ కృష్ణ, ఆనంద్,పుల్లయ్య, శ్రీనివాస్,రాములు, నరసింహ,మాజీ ఉప సర్పంచ్ మత్స్యగిరి,వలిగొండ మండల ప్రధాన కార్యదర్శి లోడే లింగస్వామి గౌడ్, ఉపాధ్యక్షులు దయాకర్,నాగరాజు, కార్యదర్శి వెంకటేశం, పద్మా రెడ్డి రామచంద్రం,రంజిత్ రెడ్డి,మహేష్,నరేందర్ రెడ్డి,అమర్, మచ్చ గిరి,వెంకటేశం, మహేష్,స్వామి, కృష్ణ, బిక్షం, జనార్దన్ రెడ్డి, వెంకటేశం,జంగయ్య , ఐల్ రెడ్డి తదితర గ్రామాల రైతులు, బూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుపై దాడి చేసిన వారిని శిక్షించాలి





రేగొండ, మండల రిపోర్టర్ - మంతెన సురేష్ (శుభోదయం న్యూస్): ప్రజలకు జరుగుతున్న అన్యాయాలు, దోపిడీలపై నిష్పక్షపాతంగా వార్తలు రాస్తున్న జర్నలిస్టులపై దాడులు చేయడం అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని అవమానించడమేనని జర్నలిస్టులపై దాడులకు నిరసనగా బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం పరకాల భూపాలపల్లి ప్రధాన రహదారి ఇందిరా గాంధీ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జిలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగామండలనికి చెందిన ఆంధ్రజ్యోతి విలేకరి తిరుపతి రెడ్డి, మాట్లాడుతూ ములుగు జిల్లా తాడ్వాయి మండల కేంద్రానికి చెందిన ఆంధ్రజ్యోతి రిపోర్టార్ శ్రీకాంత్ రెడ్డి, పై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం హేయమైన చర్య అని నిందితులను తక్షణమే అరెస్ట్ చేసి శిక్షించలని,డిమాండ్ చేశారు.జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని కొరకు. నిజాన్ని నిర్భయంగా రాస్తున్న విలేకరులపై దాడులు చేయడం పిరికిపంద చర్యగా అభివర్ణించారు.తక్షణమే మంత్రి సీతక్క చొరవచూపి దాడి జరిగిన శ్రీకాంత్ రెడ్డి కి న్యాయం చేయాలనీ కోరారు.ఈ కార్యక్రమంలో పట్టెం కోటి లింగం, బండి సోమయ్య,కటకం రాజు, నామాల రమేష్, పల్నాటి రాజు, బండి శ్రీనివాస్, రొంటాల శంకర్, సుంకరి శ్రీధర్, వెంగల రణదీర్, మంతెన మధు, సురేష్, బండి కమలాకర్, లడ్డు, మార్తా రాజు,బోయిని రాజు,రహీం పాషా, అంబాలా రవీందర్, పాల్గొన్నారు.

## వలిగొండ హై స్కూల్ లో మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు

### -ఏర్పాటు చేసిన లీగల్ సర్వీస్ టీమ్





వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాలనుసారం వలిగొండ మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు మండల లీగల్ సర్వీస్ రామన్నపేట ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు,మండల విద్యాధికారి సుంకోజు భాస్కర్ సమక్షంలో లీగల్ సర్వీస్ టీం సభ్యులు విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ యుగంధర్ గౌడ్ మరియు ఎక్సైజ్ శాఖ మోత్కూర్ ఎస్సై క్రాంతి వారి సిబ్బందితో హాజరయ్యారు.ఈ కార్యక్రమానికి హాజరైన అతిథులు మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాటులకు దూరంగా ఉండాలని, సమాజంలో మార్పు రావడానికి విద్యార్థులు పునాది అని అన్నారు. మాదక ద్రవ్యాల వినియోగంలో విద్యార్థులు అలవాటు పడి వారి జీవితాలను అయోమయంలో పడేసుకుని కుటుంబాలను రోడ్డు పాలు చేస్తున్నారని అన్నారు.విద్యార్థులు చదువుపై దృష్టి సారించి ఉన్నత స్థాయికి ఎదిగి తరతరాలు చెప్పుకునే విధంగా అభివృద్ధి చెందాలని కొనియాడారు.జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాలనుసారం పాఠశాల నందు ఏర్పాటు చేసిన యాంటీ డ్రగ్స్ మరియు ఎంపవర్మెంట్ కమిటీ ను అధికారికంగా ప్రకటించారు.ఈ కార్యక్రమంలో కమిటీ ఇన్చార్జి టీచర్ స్వామి రాజు,ఉపాధ్యాయ బృందం,లీగల్ సర్వీస్ టీమ్ సభ్యులు బత్తుల గణేష్,కానుగంటి శ్రీశైలం,పోలీస్ శాఖ సిబ్బంది,ఎక్సైజ్ శాఖ సిబ్బంది,విద్యార్థిని విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి వ్యాపారి తప్పనిసరిగా డి అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలి

### రామగుండం నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి




రామగుండం మండలం, రిపోర్టర్- తిరుపతి, (శుభోదయం న్యూస్): ప్రతి వ్యాపారి తప్పనిసరిగా డి ఓ ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని రామగుండం నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి అన్నారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా బుధవారం ట్రేడ్ లైసెన్స్ లపై 48 వ డివిజన్ లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సంధర్భంగా పాత మున్సిపల్ కార్యాలయం ప్రాంతంలో ఉన్న దుకాణ దారులకు అవగాహన కల్పించే కార్యక్రమం చేపట్టారు. డి %డ% ఓ ట్రేడ్ లైసెన్స్ తో వ్యాపారులు పొందే ప్రయోజనాలను ఆయన వారికి వివరించారు. అలాగే వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా వివిధ చోట్ల మురుగునీటి కాలువల్లో పూడిక తీత , గోడలపై సందేశాత్మక చిత్రాలతో పెయింటింగ్స్ వేయడం తదితర పనులు కూడా కొనసాగాయి. ఈ కార్యక్రమాల్లో ఎన్విరాన్ మెంటల్ ఇంజనీర్ మధుకర్ , ఎం ఐ ఎస్ ఆపరేటర్ శ్రీకాంత్ , వార్డు అధికారులు , మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.




## ఖని ప్రభుత్వ ఏరియా అస్పత్రిలో గాడి తప్పిన పాలన

### నర్సింగ్ సిబ్బంది పైన కాంట్రాక్టు సూపర్ వైజర్ వేధింపులు

### అస్పత్రిలో మెడికల్ కళశాల లో కాంట్రాక్టు పద్దతిలో పనిచేస్తున్న 60 మందిని తొలగించే ప్రయత్నం మానుకోవాలని ఎమ్మెల్యే కి విజ్ఞప్తి ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్



గోదావరిఖని టౌన్, రిపోర్టర్- సురేష్,(శుభోదయం న్యూస్) గోదావరిఖని లోని ప్రభుత్వ ఏరియా అస్పత్రిలో రోజు రోజు కి రాజకీయ జోక్యం పెరిగిపోతుందని, అస్పత్రి పాలన గాడి తప్పిందని కాంట్రాక్టు పద్ధతిలో పని చేసే వారె రాజకీయ అందండలతో ఇస్టానుసారంగా వ్యవహరిస్తూ సూపర్ వైజర్ క్రింది స్థాయి సిబ్బందితో పాటు అస్పత్రిలోని ప్రభుత్వ నర్సింగ్ సిబ్బందిని మానసికంగా వేదిస్తు పైశాచికానందం ఆనందం పొందుతున్నారని ఫైట్ ఫర్ బెటర్ సోసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ అగ్రహం వ్యక్తం చేసారు. అనంతరం అయిన మాట్లాడుతూ ప్రభుత్వ అస్పత్రిలో అధికార పార్టీ నేతల అనుచరులను ఏర్పాటు చేసుకొని వారి సొంత ప్రయివేట్ అస్పత్రి లాగ భవిస్తున్నారని అస్పత్రిలో పనిచేసే ప్రభుత్వ సిబ్బంది మరియు కాంట్రాక్టు సిబ్బంది పైన ఒక సూపర్ వైజర్ ఆడపిల్లలను వేధింపులకు గురిచేస్తూ రక్షానందం పొందుతుంటే సూపరిండెంట్ ప్రిన్సిపాల్ గార్లకు పట్టింపు ఉండదా అని ప్రశ్నించారు. మాకు కాంట్రాక్టు సూపర్ వైజర్ వాళ్ళ మాకు ఇబ్బందులు అవుతున్నాయని సాక్షాత్తు సూపరిండెంట్ గారికి నర్సింగ్ సిబ్బంది వినతిపత్రం ఇచ్చిన కనీసం పట్టింపు లేదు అలంటి సూపరిండెంట్ ఉన్న లేనేట్టే అని ఆరోపించారు.ఇక సూపర్ వైజర్ కు ఒక ఆర్ఎంఓ స్థాయి అధికారి మద్దతు తెలపడం సిగ్గు చేటు అని పార్కొన్నారు. అస్పత్రిలో పనిచేస్తున్న నర్సింగ్ సిబ్బంది ని వేడిస్తున్నారని తెల్సి కూడా వారికి అండగా నిల్వల్సిన ఆర్ఎంఓ అధికారి ఓకరు వేధింపులకు గురి చేసే సూపర్ వైజర్ అంటే ఎందుకు అంత ప్రేమ అని వారికి అండగా నిల్వడంలో వారి ఆంతర్యం ఏమిటి అని ప్రశ్నించారు.మరి నాలుగు రోజుల క్రింద కాంట్రాక్టు పద్ధతిన పని చేస్తున్న అయిదుగురు సిబ్బంది ని తొలగించరని పత్రిలలో చూసాం కదా మరి వారి కోసం ఈ ఆర్ఎంఓ అధికారి అండగా ఎందుకు నిలవటం లేదు అన్నారు. అధికార పార్టీ నేతలు అస్పత్రిలో నిర్వహణలో తల దూర్చి వారికి నచ్చిన వారిని కాంట్రాక్టర్ కి చెప్పి ఉద్యోగంలోకి తీసుకోవాలని ఆదేశాలు ఇవ్వడం నచ్చని వారిని తిలగించాలని చెప్పడం జరుగుతుందని విమర్శించారు.అస్పత్రిలో చిన్న చిన్న తప్పిదాలు తెల్సి తేలియక చేస్తేనే తొలగించే ప్రిన్సిపల్, కాంట్రాక్టర్లు, అధికార పార్టీ నేతలు మరి ఆడపిల్లలను వేదిస్తున్నవి కనపడటం లేదా అని ఆగ్రహం వ్యక్తం చేసారు.వేధింపులకు గురిచేస్తున్న సూపర్ వైజర్ తొలగించి ఒక మహిళా సూపర్ వైజర్ నియమించాలని డిమాండ్ చేసారు. అస్పత్రి పై జిల్లా కలెక్టర్ గారు ప్రత్యేక ద్రుష్టి సారించాలని వారోనికోసారి ఆకస్మిక తనిఖీలు చేయాలని అన్నారు.ఇక గత ప్రభుత్వంలో మెడికల్ కళశాల మంజూరై దానికి అనుగుణంగా అస్పత్రి బెడ్ల సంఖ్య పెంచడం వల్ల శనీటేషన్, సెక్యూరిటీ, పెషేంట్ కెర్ సంబందించిన టెండర్ల ద్వారా వందకు పైగా ఉద్యోగులను నియమించుకున్నారు, ఇందులో భాగంగా వారు మూడేళ్ల నుండి ఉద్యోగం చేసుకుంటూ వారి కుటుంబాలను పోశించుకుంటున్నారని ఇప్పుడు ప్రభుత్వం మరి దాదాపు రెండు ఏళ్ళు దగ్గరికి వస్తున్న తరుణంలో మెడికల్ కళశాల మరియు ప్రభుత్వ అస్పత్రిలలో పనిచేస్తున్న కాంట్రాక్టు సిబ్బంది 60 మందికి పైగా తోలగిస్తున్నామని అధికార పార్టీ నేతలు కాంట్రాక్టర్లకు ఆదేశాలు ఇచ్చరని ప్రచారాలు జరుగుతున్నాయని ఒకవేళ అదే నిజం అయితే స్థానిక రామగుండం ఎమ్మెల్యే గారు అలాంటి ఆలోచన విరమించుకువాలని కూలి నాలి చేసి కష్టపడి అస్పత్రిలో పని దొరికించుకొని పనిచేసుకుంటున్న వారిని వారి కుటుంబ సభ్యులను రోడ్డున పడేయకండని ఎమ్మెల్యే ని కోరుతున్నామన్నారు. ప్రభుత్వ జనరల్ అస్పత్రిలో మెడికల్ కళశాల లో మీ అనుచర వర్గం మీ పేరు చెప్పుకొని అరాచకాలు సృష్టిస్తున్నారని అలాంటి వారిని ప్రోత్సహించడం మనుకోవాలని, మరియు అస్పత్రిలో సిబ్బందిని తలగించకుండా మరింత కొత్త సిబ్బందిని నియమించే విదంగా డీఎంఈ నుండి మరియు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వర్యులు నుండి ఆర్డర్ తీసుకరావాలని ఎమ్మెల్యే గారికి దినేష్ సూచించారు.

## తెలంగాణ జాగృతి విద్యార్థి సమైక్య రాష్ట్ర నాయకులు తోట హరీష్ గౌడ్ ఆధ్వర్యంలో ఎంఈఓ గారికి ప్రవేట్ పాఠశాలల పై ఫిర్యాదు



గోదావరిఖని టౌన్, రిపోర్టర్- సురేష్,(శుభోదయం న్యూస్) గోదావరిఖని లోని ప్రైవేట్ పాఠశాలలు ఇష్టానుసారంగా ఫీజులు పెంచి ఫీజులు వసూలు చేస్తున్నారు. అంతేకాకుండా తమ పాఠశాలలోనే పుస్తకాలు, స్కూల్ బ్యాగులు, షూలు, టై, దీనితో పాటు స్పోర్ట్స్ కు సంబంధించిన డ్రెస్ కూడా కొనాలంటూ తల్లిదండ్రులపై ఆంక్షలు విధిస్తున్నారు. ఇష్టానుసారంగా ఫీజులు వసూలు ప్రైవేట్ పాఠశాలలో తరగతితో సంబంధం లేకుండా ప్రైవేట్ పాఠశాల యజమాన్యాలు ఇష్టం వచ్చిన రీతిగా ఫీజులు నిర్ణయించి తల్లిదండ్రులపై భారం పెడుతున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఫీజులు కట్టలేక మానసికంగా కృంగిపోతున్నారు. ప్రత్యేక బుక్ స్టాల్ బుక్స్ వారు చెప్పిన చోటనే కొనాలి అని నిబంధనలు పెడుతున్నారు. లేదంటే ఏకంగా పాఠశాలలో ప్రత్యేక బుక్ స్టాల్ కౌంటర్ ను ఏర్పాటు చేసి అధిక ధరలకు విద్యార్థులకు పుస్తకాలు అమ్ముతున్నారు.వేలకు వేలు ఫీజు వసూలు చేస్తూ విద్యార్థులకు కనీస సౌకర్యాలు కూడా కల్పించని దుస్థితి, తాగడానికి మంచి నీళ్లు లేకపోవడమే కాకుండా, బాత్రూంలు అపరిశుభ్రత తో ఉండటం, భోజనం చేయడానికి కానీస సౌకర్యం కూడా ఉండటం లేదు, అంతేకాకుండా పిల్లల సైకిల్ పార్కింగ్ షెడ్లు లేవు, అంతేకాకుండా రోడ్ల పైన పార్కింగ్ చేయడం విద్యార్థుల యొక్క సైకిళ్ళు ఖరాబ్ అవ్వడం ఎన్నోసార్లు సైకిల్ పోయిన సంఘటన కూడా ఉన్నాయని విద్యార్థుల తల్లి దండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్కూల్ బస్సు చార్జీలు పేరుతో ఫీజుతో సంబంధం లేకుండా బస్సు ఫీజు సపరేట్ అంటూ తల్లిదండ్రుల దగ్గర బస్సు ఫీజు వసూలు చేస్తున్నారు. పెట్రోల్, డీజిల్ పెరిగాయి అంటూ బస్సు ఫీజు అధికంగా వసూలు చేస్తున్నారు. పాఠశాల బస్సులు కండిషన్ లో ఉన్నాయో లేవో ఆర్టీవో తనిఖీ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పాఠశాల బస్సులు అనేకమార్లు ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అధిక ఫీజుల పైన, పుస్తకాల పైన, బస్సుచార్జీలు పై ప్రైవేట్ పాఠశాల యజమానులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని విద్యార్థుల తల్లిదండ్రుల తరుపున కోరుకుంటున్నారు.

## 2025-2026 ఆస్తి పన్ను చెల్లించడానికి ఎలాంటి అపరాధ రుసుము లేకుండా జూన్ 30 వరకు అవకాశం

### అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె.అరుణ శ్రీ




రామగుండం మండలం, రిపోర్టర్- తిరుపతి, (శుభోదయం న్యూస్): అపరాధ రుసుం లేకుండా 2025-26 ఆర్థిక సంవత్సరం ఆస్తిపన్ను చెల్లించడానికి జూన్ 30 వరకు అవకాశం ఉందని అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)%డ%కమిషనర్ (ఎఫ్ ఎ సి) జె.అరుణశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. జూలై ఒకటి నుండి పన్ను మొత్తంపై నెలకు రెండు శాతం అపరాధ రుసుం విధించడం జరుగుతుందని తెలిపారు.కావున ఈ ఆకాశాన్ని సద్వినియోగం చేసుకొని వెంటనే ఆస్తిపన్ను చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు.

## టౌన్ ప్లానింగ్ అధికారి అవినీతిపై తెలంగాణ టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ కు ఫిర్యాదు



రామగుండం మండలం, రిపోర్టర్- తిరుపతి, (శుభోదయం న్యూస్): పెద్దపల్లి జిల్లా:రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన టౌన్ ప్లానింగ్ అధికారి (టీపీవో) నవీన్ తీవ్ర అవినీతి, అధికార దుర్వినియోగ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయమై రామగుండానికి చెందిన న్యాయవాది సింగం జనార్ధన్ తెలంగాణ రాష్ట్ర టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో తెలిపిన వివరాల ప్రకారం, ఎన్‌టీపీసీ పరిధిలో ఉన్న లక్ష్మీ నరసింహ గార్డెన్స్ ఏసి ఫంక్షన్ హాల్ యజమాని చింతలపల్లి కిషన్ రావు, మున్సిపల్ అనుమతులు లేకుండానే పార్కింగ్ స్థలంపై అక్రమంగా కాంపౌండ్ వాల్ నిర్మించారని పేర్కొన్నారు. సంబంధిత ఫంక్షన్ హాల్ పై కూడా అనేక ఫిర్యాదులు చేసినప్పటికీ, అధికారుల నుండి ఎలాంటి చర్యలు తీసుకోబడలేదని వాపోయారు.టీపీఓ నవీన్ గత కొంతకాలంగా కార్యాలయంలో లభ్యం కాకపోవడమే కాకుండా, ఫోన్‌కాల్స్‌కు కూడా స్పందించడం లేదని, బాధితులతో కాకుండా ఫంక్షన్ హాల్ యజమానితో కుమ్మక్కై, ఫిర్యాదులను ఎలాంటి పరిశీలన లేకుండా కాలయాపన చేస్తున్నాడని ఫిర్యాదుదారు ఆరోపించారు.ఈ క్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి నవీన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అలాగే అనుమతులు లేకుండా నిర్మించిన కాంపౌండ్ వాల్ మరియు గదులను తొలగించాలని డైరెక్టర్ టౌన్ ప్లానింగ్‌కి విజ్ఞప్తి చేశారు. ఇకపోతే ఈ వ్యవహారంపై పెద్దపెల్లి జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు లేఖను జతపరిచినట్లు ఆయన తెలిపారు. ఈ ఫిర్యాదుకు తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ మంత్రికి, మరియు ముఖ్యమంత్రి కార్యాలయానికి ప్రతులు పంపినట్లు వెల్లడించారు.

## రైతు క్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్

### సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



జిన్నారం, (శుభోదయం న్యూస్): కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని పటాన్చెరువు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ గారు అన్నారు. బుధవారం జిన్నారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విజయోత్సవ సంబరాల్లో కాటా శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గ రైతులకు రైతు భరోసా నిధులు విడుదలైన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి కార్యకర్తలతో కలిసి పాలాభిషేకం చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి



పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటాన్ చెరు నియోజకవర్గంలో 27,000 మంది రైతులకు 30 కోట్ల భరోసా నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం తొమ్మిది రోజుల్లో 9000 కోట్ల భరోసా నిధులు విడుదల చేసిందని చెప్పారు. ప్రతిపక్షా నేతలు రాజకీయ లబ్ధి కోసమే ధర్నా చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ రైతు పక్షపాతి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జైపాల్ రెడ్డి , ఆలయ కమిటీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి,ఆత్మ కమిటీ డైరెక్టర్ లక్ష్మా రెడ్డి , కాంగ్రెస్ మండల నాయకులు వడ్డే కృష్ణ , వీరారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, మంగంపేట గణేష్, ఇనగండ్ల నరేందర్, కోరబోయిన నరేష్, మ్యాదరి శంకరయ్య, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ గోపాలమ్మ , శ్రీధర్ రెడ్డి, నర్సింగరావు, మాజీ ఎంపీటీసీ రాజు, చక్రపాణి, యువజన నాయకులు బషీర్, ఇమ్రాన్, సోహైల్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దళిత గిరిజన విద్య పైన చిత్త శుద్ధి లేని రాష్ట్ర ప్రభుత్వం కేవీపీస్ జిల్లా కార్యదర్శి కల్లేపల్లి అశోక్



ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో శ్రీనివాస్ (శుభోదయం న్యూస్) జూన్- 25: పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు బెస్ట్ అవైలబుల్ స్కీం పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులతో కెవిపిఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగింది, అనంతరం కేవీపీస్ జిల్లా కార్యదర్శి కల్లెపల్లి అశోక్ మాట్లాడుతూ. బెస్ట్ అవైలబుల్ స్కీం విద్యార్థినీ విద్యార్థులకు 3 సంవత్సరాలుగా పెండింగ్ బిల్లులు ఉండడం వలన జిల్లాలో విద్యార్థులను స్కూల్లో జాయిన్ చేసుకోవడం లేదని ఫీజులు కట్టమని పుస్తకాలు బట్టలు కొనమని మనోవేదనకు యజమాన్యాలు గురిచేస్తున్న అధికారులు పట్టి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. రాష్ట్ర మంత్రులు కానీ జిల్లా కలెక్టర్ కానీ ఎలాంటి శ్రద్ధ చూపడం లేదని అన్నారు. విద్యార్థులకు విద్య అందించుటకు ఇప్పటికైనా పెండింగ్ బిల్లును విడుదల చేసి ప్రతి ఒక్క విద్యార్థిని పాఠశాలలో జాయిన్ చేయించి బట్టలు పుస్తకాలు అందించాలని కోరారు.కేవీపీస్ జిల్లా అధ్యక్షులు మొదుంపల్లి శ్రావణ్ మాట్లాడుతూ. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి బెస్ట్ అవైలబుల్ స్కీమ్ విద్యార్థుల సమస్యల పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమాలు చేపడతామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు ,నందన్, రాజు,లావణ్య, శ్రీనివాస్, బానోత్ రాజేష్, రవి రమేష్ నరేష్,తదితరులు పాల్గొన్నారు.

# రేర్ ఎర్త్ ఎగుమతులపై చైనా ఆంక్షలు. తయారీ రంగంపై తీవ్ర ప్రభావం

### కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరిన మంత్రి శ్రీధర్ బాబు



ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో శ్రీనివాస్ (శుభోదయం న్యూస్) జూన్ -25: బుధవారం ఢిల్లీలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తో ప్రత్యేకంగా సమావేశమై వినతి పత్రం సమర్పించారు. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తికి అవసరమైన రేర్ ఎర్త్ మాగ్నెట్లు, కీలక ముడి పదార్థాలు, రసాయనాలు ఎక్కువగా చైనా నుంచే దిగుమతి అవుతున్నాయి. ఈ తరహా పదార్థాల ఎగుమతులపై ఆ దేశం తాజాగా ఆంక్షలు విధించింది. ఆ ప్రభావం ఎలక్ట్రానిక్స్, ఈవీలు తయారు చేసే పరిశ్రమలపై పడింది. రాబోయే రోజుల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగితే తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ముఖ్యంగా తెలంగాణలో తయారీ రంగంపై ఈ ప్రభావం ఎక్కువగా పడుతుంది' అని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. ఎలక్ట్రానిక్స్, ఈవీ తయారీ పరిశ్రమలకు ఇబ్బంది కలగకుండా వాస్తవ పరిస్థితిని సమీక్షించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు.పారిశ్రామిక రంగం బలోపేతానికి సహకరించండి.రాష్ట్రంలో పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్రం పూర్తి స్థాయి సహకారం అందించాలని కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌ను మంత్రి శ్రీధర్ బాబు కోరారు. ముఖ్యంగా హైదరాబాద్-నాగ్‌పూర్, హైదరాబాద్-వరంగల్, హైదరాబాద్-బెంగళూరు మరియు హైదరాబాద్-విజయవాడ ఇండస్ట్రియల్ కారిడార్ల అభివృద్ధి వివరాలు వివరించారు. జహీరాబాద్‌లో అభివృద్ధి చేస్తున్న ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కింద అవసరమైన మౌలిక సదుపాయాల కోసం రూ.400 కోట్ల నిధులు పీఎం గతిశక్తి పథకం కింద మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఫ్యూచర్ సిటీ అభివృద్ధి.గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా హైదరాబాద్-వరంగల్ ఇండస్ట్రియల్ కారిడార్ (హెచ్ డబ్లు ఐ సి) నిలిచిపోయిందని కేంద్రమంత్రికి దృష్టికి తీసుకెళ్లారు. అయితే. ఇందులో భాగంగాఉన్న ఫార్మా సిటీని ప్రభుత్వం ఇప్పుడు ఫ్యూచర్ సిటీ'గా అభివృద్ధి చేస్తోందని తెలిపారు. ఇందుకు సహకరించాలని కోరారు. అలాగే వరంగల్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధి సహా పలు నోడ్స్‌కు కేంద్రం నిధులు విడుదల చేసేలా చొరవ చూపాలని కోరారు.తెలంగాణకు ప్రాధాన్యం ఇవ్వండి. కేంద్రం ప్రతిపాదించిన 100 పారిశ్రామిక పార్కుల పథకం కింద తెలంగాణలో పార్కుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తిగా ఉందని, ఇప్పటికే ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తమ అభిప్రాయాలు పంపినట్లు గుర్తు చేశారు. ఈ ప్రాజెక్టులకు తగిన నిధులు మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరారు. హైదరాబాద్‌లో జాతీయ డిజైన్ సెంటర్ ఏర్పాటు చేయండి.దేశంలో డిజైన్ రంగాన్ని ఉద్ధరిస్తూ, మేడ్ ఇన్ ఇండియా ఉత్పత్తుల ద్వారా గ్లోబల్ గుర్తింపు సాధించేలా హైదరాబాద్‌లో జాతీయ డిజైన్ సెంటర్ (ఎన్ డిసి) ఏర్పాటు చేయాలని రాష్ట్రం ప్రతిపాదించిందన్నారు. ఇది దేశవ్యాప్తంగా డిజైన్ థింకింగ్‌కు కేంద్రంగా మారుతుందన్నారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యంలో తెలంగాణ భాగస్వామ్యం.ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా తెలంగాణ పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేస్తోందని, కేంద్రంతో కలిసి వికసిత్ భారత్ 2047 లక్ష్యం సాధనలో రాష్ట్రం ముందుంటుందని శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

## ఆటో హక్కులపై స్పందించాలని వినతి పత్రం



ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో శ్రీనివాస్ (శుభోదయం న్యూస్) జూన్- 25: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం చేస్తున్న పోరాటానికి ఆటో జేఏసీ సంపూర్ణ మద్దతు. నిజామాబాద్ ఎమ్మెల్సీ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను బంజారాహిల్స్ లోని తమ నివాసంలో టీ ఆటో జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు మంద రవికుమార్,రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్కే దస్తగిరి, రాష్ట్ర ఉపాధ్యక్షులు బుగుడాల సాయిలు. కలిసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఎమ్మెల్సీ కవిత చేస్తున్న పోరాటానికి తమ సంఘీభావాన్ని తెలియజేస్తూ, ఆటో హక్కులపై స్పందించాలని వినతిపత్రం ఇవ్వడం జరిగింది. దానికి వారు స్పందిస్తూ ఆటో యూనియన్ నాయకులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి తమ మద్దతు ఎప్పుడు ఉంటుందని, కాంగ్రెస్ పార్టీ 2023 ఎన్నికల్లో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అట్లాగే బీసీల రిజర్వేషన్ల కోసం చేస్తున్న తమ పోరాటానికి టి ఆటో జేఏసీ మద్దతు ఇచ్చినందుకు ఎమ్మెల్సీ కవిత హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జాగృతి నాయకులు రూప్సింగ్. ఆటో యూనియన్ నాయకులు ఎస్కే సలీం. జాకీర్ బాయ్, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సర్పంచ్ లకు పరిపాలన శిక్షణ




తోట్టంబేడు, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్) :తొట్టంబేడు మండల పరిషత్ కార్యాలయం నందు నియోజకవర్గంలోని మహిళా సర్పంచ్‌లకు మూడో రోజు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు, మహిళా సర్పంచ్‌లకు పాలన,వారి హక్కులు, బాధ్యతలు, సమాజంలో వారి పాత్ర వంటి విషయాలపై శ్రీకాళహస్తి ఐసిడిఎస్ సిడిపిఓ శాంతి దుర్గ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని మహిళా సర్పంచ్‌లకు పాలన, వారి హక్కులు, బాధ్యతలు, సమాజంలో వారి పాత్ర వంటి విషయాలపై శిక్షణ తరగతులు నిర్వహించామని ,మహిళా సర్పంచ్‌లకు .కేంద్ర, రాష్ట్ర నిధుల వినియోగం, గ్రామీణ పరిపాలనలో అవగాహన పెంపొందించేందుకు ఈ శిక్షణలు నిర్వహించామని గ్రామాలలో మౌలిక వసతుల కల్పనలో నిధులను సమర్థవంతంగా వినియోగించేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందని తెలియజేశారు, మహిళలు ఆత్మవిశ్వాసంతో వారి విధి నిర్వహణ సమర్ధవంతంగా నిర్వహించాలని ఈ సదస్సులలో మహిళా సర్పంచులకు అవగాహన కల్పించామని తెలియజేశారు.

## గొర్రెలు-మేకల ఉచిత మందులు పంపిణీ - కార్యక్రమాన్ని ప్రారంభించిన బొజ్జల సుధీర్ రెడ్డి



శ్రీకాళహస్తి, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్):ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పశుసంపద సంరక్షణలో భాగంగా గొర్రెలు, మేకలకు ఉచితంగా నులిపురుగులు,నట్టపురుగుల నివారణ మందులను పంపిణీ చేసే కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించింది.ఈ కార్యక్రమం జూన్ 26వ తేదీన ప్రారంభమై జూలై 10వ తేదీ వరకు కొనసాగనుంది.ఈ సందర్భంగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు,ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి రైతులకు మందులను ఉచితంగా పంపిణీ చేశారు,ఎమ్మెల్యే మాట్లాడుతూ 2025 సంవత్సరానికి గాను మొదటి విడతగా 4.45,000 రూపాయల విలువైన మందులను ప్రభుత్వం మంజూరు చేసి, పశువైద్య శాఖ ద్వారా రైతుల పంపిణీ చేస్తుందని, ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది ప్రతి గ్రామానికి వెళ్లి గొర్రెలు,మేకల పెంపకదారుల ఇళ్ల వద్దకే చేరుకుని ఈ మందులను ఉచితంగా గొర్రెలకు మేకలకు తాగించుతారని, ఈ మందులు తీసుకోవడంతో గొర్రెలు మేకలు ఆరోగ్యం మెరుగుపడేందుకు, పోషక లోపాలు తొలగించేందుకు మరియు ఎటువంటి చర్మ వ్యాధులు ఇతరత్రా వ్యాధుల నివారణకు దోహదపడతాయని అన్నారు, రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని, పశుసంపద సంరక్షణకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నదని , ఈ ఉచిత మందుల పంపిణీ వల్ల గొర్రెలు, మేకల ఆరోగ్యం మెరుగవడం ద్వారా మాంస,పాలు ఉత్పత్తి పెరిగి రైతులకు ఆదాయ వృద్ధి చేకూరుస్తుందని అన్నారు.ఈ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని తమ పశుసంపదను ఆరోగ్యంగా కాపాడుకోవాలని, గ్రామ పశువైద్యుల సూచనల మేరకు సహకరించాలని సూచించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.గోవిందరరాజు భాస్కర్, ఊరందూరు వెటర్నరీ డాక్టర్ ఎస్. సునీత వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

## అనధికారికంగా ప్రెస్,పోలీస్ స్టిక్కర్లు వాహనాలపై అంటించుకుంటే చర్యలు - సీఐ నాగార్జున రెడ్డి



శ్రీకాళహస్తి, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్):జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాలతో శ్రీకాళహస్తి డిఎస్పి నరసింహ మూర్తి పర్యవేక్షణలో టూ టౌన్ సీఐ నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో అనధికారికంగా ప్రెస్,పోలీసు స్టిక్కర్ వేసుకున్న వాహనదారులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు,.జిల్లా వ్యాప్తంగా అనధికారికంగా కార్లు,ద్విచక్ర వాహనాలపై ప్రెస్, పోలీస్ స్టిక్కర్ వేసుకుంటే చర్యలు తీసుకుంటామని అన్నారు,అనధికారికంగా ప్రెస్, పోలీసు స్టిక్కర్లు వేసుకున్న ప్రెస్ 3 వాహనాలు, పోలీసు 2 వాహనదారులకు మొదటి తప్పుగా పరిగణలోకి తీసుకొని కౌన్సిలింగ్ ఇచ్చారు,తిరుపతి జిల్లాలో కొందరు జర్నలిస్టులు, పోలీసులు కాకున్నా తమ వాహనాలపై ప్రెస్, పోలీస్ అని స్టిక్కర్లు అతికించుకుని తిరుగుతున్నట్లు సమాచారం రావడం జరిగినది,ఇక నుండి ఎవరైన ప్రెస్, పోలీసు స్టిక్కర్స్ గుర్తింపు కార్డులు లేకుండా వేసుకుని తిరిగే అలాంటి వారి పై చట్టపరమైన చర్యలు తీసుకొనబడతాయి.పోలీసు నిబంధనలు ఎవరు ఉల్లంఘించిన వారి వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్.ఐ. గోవిందు, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## హాస్టల్ విద్యార్థులను పరామర్శించిన ఎమ్మెల్యే బొజ్జల



శ్రీకాళహస్తి, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్):కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొంది హాస్టల్ కు చేరుకున్న విద్యార్థులను శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి బుధవారం పరామర్శించారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో మారు ఇలాంటివి ఘటనలు జరగకుండా చూసుకుంటానని ధైర్యం చెప్పారు,జరిగిన సంఘటనపై విచారణ జరిపించి హాస్టల్ వార్డెన్ ను సస్పెండ్ చేయడం జరిగిందని తెలియజేశారు,విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థులకు పౌష్టికాహారం అందించే విధంగా సన్నబియ్యం అందజేస్తున్నారని, సన్న బియ్యంతో పౌష్టిక ఆహారం విద్యార్థులకు లభిస్తుందని తెలియజేశారు, మరోమారు నియోజకవర్గంలోని ఏ హాస్టల్ నందు ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రత్యేక బృందాన్ని హాస్టల్ లను పరిశీలించే విధంగా ఏర్పాటు చేస్తామని , హాస్టల్ లను ఆకస్మిక తనిఖీలు నిర్వహించి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలతో పాటు, పౌష్టికాహారం అదే విధంగా తనవంతు కృషి చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రంగినేని చెంచయ్య నాయుడు, విజయ్ కుమార్ నాయుడు, కాపురం రమేష్, నెమళ్ళురు బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఏఐ సేవలు ప్రవేశపెట్టండి - గూగుల్ వైస్ ప్రెసిడెంట్ తోట చందును కోరిన ఎమ్మెల్యే



శ్రీకాళహస్తి, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్):శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి ఆలయానికి కూడా ఏఐ టెక్నాలజీ ద్వారా సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి గూగుల్ వైస్ ప్రెసిడెంట్ తోట చందు ను కోరారు. బుధవారం శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేసిన ఆయన్ను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయం గురించి ఆయనకి వివరించారు. ఇక్కడ భక్తుల తాకిడి, రాహుకేతు పూజలు తదితర వాటి గురించి ఆయనతో కలిసి చర్చించారు. ఆలయంలో రాహుకేతు పూజలు చేసుకొన్న తరువాత తొట చందుతో ఆయన ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. కలియుగ ప్రత్యక్ష దైవం వెంకన్న స్వామి దర్శన భాగ్యం కోసం భక్తులు ఎక్కువ సమయం వేచి ఉండకుండా తిరుమల తిరుపతి దేవస్థానం ఏఐ టెక్నాలజీ వినియోగించేందుకు చర్యలు ప్రారంభించింది. కొన్ని నెలల క్రితం టిటిడి ఈవో శ్యామలారావు ఇతర అధికారులు ఈ మెషిన్ ట్రయల్ సైతం చెక్ చేశారు. దీన్ని వారం రోజుల పాటు ప్రయోగాత్మకంగా అమలు సైతం చేశారు. ఈ ప్రక్రియ విజయవంతం అయితే త్వరలో దీనికి ఆమోదం తెలపనున్నారు. తిరుమలలోని కంపార్ట్‌మెంట్లు, ప్రవేశం, బయటకు వచ్చే మార్గాల మధ్య ఏఐ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. క్యూలైన్లలో రద్దీని తగ్గించి, భక్తులకు మరింత సౌకర్యవంతంగా దర్శనం కల్పించాలనేది టీటీడీ లక్ష్యం. క్యూలైన్లలోకి వచ్చే భక్తుల వివరాలను ఏఐ కెమెరాలు సేకరిస్తాయి.. సర్వదర్శనం, స్లాటెడ్ దర్శనం, ప్రత్యేక ప్రవేశ దర్శనం చేసుకునే భక్తుల వివరాలను లెక్కిస్తారు. అలాగే అదనంగా క్యూలైన్లలో కలిసే వారిని కూడా గుర్తిస్తారు.. దీని ద్వారా దర్శనానికి పట్టే సమయం కచ్చితంగా తెలుస్తుంది. గంట కంటే తక్కువ సమయంలోనే దర్శనం పూర్తవుతుంది. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఇదే టెక్నాలజీ గురించి ఆయనతో మాట్లాడారు. ఆలయంలో భక్తులు ఎదుర్కొనే ఏ సమస్యలను అయినా ఏఐతో పరిష్కారం అవుతాయని ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యే కి తెలియచేసారు. తిరుమలలో కంటే ముందుగానే శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ టెక్నాలజీ ప్రవేశ పెట్టమని తొట చందును ఎమ్మెల్యే బొజ్జల కోరాడంతో ఆయన ఎఐ ప్రవేశ పెట్టడం జరుగుతుందని హామీ ఇచ్చారు.దీంతో శ్రీకాళహస్తీశ్వరాలయంలో రాహుకేతు సమయంలో రద్దీ నివారించటం, అధిక సంఖ్యలో భక్తులు వస్తే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్వరితగతిన దర్శనం అయ్యే అవకాశం ఉంటుంది.

## బీసీ నేత అందరు భక్తులకి ఎంతో మధుర గానాలు వినిపించిన గాన కోకిల కొండల స్వామిని.....



(శుభోదయం న్యూస్) : బాపట్ల జిల్లా కర్లపాలెం చిన్ననాటి నుండి కూడా సినిమాల అనౌన్స్మెంట్ కి ఎంతో అద్భుతంగా వాయిస్ ఇచ్చే స్థాయి దగ్గరనుంచి అయ్యప్ప స్వామి భజన గీతాలు ఎంతో అద్భుతంగా



పాడే స్థాయికి ఎదిగి భక్తుల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిన కొండల స్వామిని ఘనంగా సన్మానించిన బీసీ బడుగు బలహీన వర్గాల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఉప్పాల మురళి గౌడ్, సంచార జాతుల రాష్ట్ర నాయకులు చల్లా రామయ్య, ఆంధ్రప్రదేశ్ గిరిజన యానాది హక్కుల రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏకశిరి నరసింహారావు, బీసీ సమన్వయ కమిటీ జిల్లా అధ్యక్షులు మాచవరపు శ్రీనివాసులు, బీసీ నాయకులు స్వర్ణ శ్రీనివాసులు,బన్న రావూరి రామకృష్ణ, నర్రా రమేష్, గండికోట రాంబాబు, చిరంజీవులు నరసింహారావు, చేపల మార్కెట్ మహిళలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సేంద్రియ బియ్యంతో జగన్నాథునికి అమృతాన్న భోగం



భువనేశ్వర్: పూరీ జగన్నాథుని దైనందిన భోగాల నివేదనలో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది రథ యాత్ర మొదలుకొని స్వామి వారికి అమృత అన్న భోగం నివేదన ప్రారంభించనున్నారు ఈ కార్యాచరణలో భాగంగా రథ యాత్ర నుంచి గుండిచా మందిరం అడపా మండపంలో కొఠా భోగ సమయంలో మహా ప్రభువుకు అమృత అన్నం నైవేద్యంగా సమర్పిస్తారు. సోమవారం మందిరం ప్రధాన నిర్వాహకుడు (సీఏఓ) డాక్టర్ అరవింద కుమార్ పాడీ అధ్యక్షతన జరిగిన అధికారిక సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. బొడు సువార్, సువార్ మహాసువార్ ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. సువార్ మహాసువార్ భోగ మండపంలో అమృత అన్నం ఉపయోగించాలని ప్రతిపాదించారు. మహా ప్రభువు భోగం తయారీలో అమత అన్నాన్ని ఉపయోగించడం గురించి గతంలో చర్చించి ప్రయోగాత్మకంగా ఈ చర్యని అమలు చేశారు. కొరాపుట్ ప్రగతి ఇనిస్టిట్యూట్ అమృత అన్నం బియ్యం సరఫరాకు మద్దతు ప్రకటించిందని సీఏఓ తెలిపారు. ఈ సంస్థ ప్రతినిధులు కూడా సమావేశంలో పాల్గొన్నారు.

### సేంద్రియ బియ్యంతో ప్రసాదం తయారీ..

మందిరంలో జగన్నాథుని అన్న ప్రసాదాలు మహా ప్రసాదంగా ప్రతీతి. ఈ ప్రసాదం సేంద్రియ బియ్యాన్ని ఉపయోగించి తయారు చేయాలని పాలక వర్గం నిర్ణయించడం ప్రత్యేకత సంతరించుకుంది. స్వామి నిత్య అన్న ప్రసాదాల తయారీలో సేంద్రియ బియ్యం వినియోగిస్తారు. ఈ బియ్యంతో వండిన ప్రసాదాల్ని అమృత్ అన్నం అనే ప్రత్యేక పేరుతో వ్యవహరిస్తారు. ఎటువంటి రసాయన ఎరువులు ఉపయోగించకుండా సహజమైన ఎరువులను ఉపయోగించి సాగు చేసిన బియ్యం మాత్రమే వినియోగిస్తారు. తొలి దశలో స్వామికి నివేదించే కొఠా భోగ సేవలో మాత్రమే వినియోగిస్తారు. తదుపరి దశలో ఇతర అన్ని వంటకాల్లో ఈ బియ్యం వినియోగం బలపరుస్తారు. రాష్ట్రంలో రైతులు పండిస్తున్న కొళాజీర, పింపుడిబాసా, యువరాజ్ మొదలైన సేంద్రియ బియ్యాన్ని అమృత అన్న మహా ప్రసాదంలో ఉపయోగిస్తారు. మందిరంలో రోజుకు 50 నుండి 55 క్వింటాళ్ల బియ్యంతో స్వామి మహా ప్రసాదం వంటకం అవుతుంది. ప్రత్యేక ఉత్సవాలు, పండగపబ్బాల సందర్భంగా రోజుకు 100 నుండి 200 క్వింటాళ్ల బియ్యాన్ని ఉపయోగిస్తారు. అదనంగా కొఠా భోగం కోసం ప్రతి రోజూ 100 కిలోల బియ్యాన్ని ఉపయోగిస్తారు. అన్న మహా ప్రసాదానికి అధిక నాణ్యత గల బియ్యం వినియోగానికి ప్రాధాన్యం కల్పిస్తున్నారు. పిండి వంటల ప్రసాదాల తయారీలో మసూరి బియ్యం కొనసాగుతుంది. క్రమంగా వీటి స్థానంలో అమృత్ అన్నం బియ్యం వినియోగించే యోచన ఉన్నట్లు పేర్కొన్నారు. పథకం ప్రకారం మందిరం అన్న ప్రసాదాల తయారీలో కొరత లేకుండా అమృత అన్నం బియ్యం సరఫరా చేసేందుకు కనీసం నాలుగు వందల నుంచి ఐదు వందల ఎకరాల భూమిలో సేంద్రియ వరి సాగు అవసరం అని అనుభవజ్ఞుల వర్గం పేర్కొంది. మందిరం పాలక వర్గం ఈ మేరకు సన్నాహాలు చురుగ్గా కొనసాగిస్తుంది.

## రాజకీయాలకతీతంగా బోనాలు చేసుకుందాం.. పొన్నం పిలుపు




హైదరాబాద్, జూన్ 24: నగరంలో ఎంతో వైభవంగా జరిగే సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర ఉత్సవాలపై ఇన్‌ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అమ్మవారి బోనాల ఉత్సవాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. చారిత్రాత్మకమైన ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలు రాజకీయాలకు అతీతంగా చేసుకుందామని పిలుపునిచ్చారు. ప్రభుత్వం పక్షాన ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా స్థానికుల సహకారం లేకపోతే విజయవంతం కాదన్నారు. గత సంవత్సరం ఏమైనా పొరపాటు జరిగితే సమీక్షించుకుని మరిన్ని ఏర్పాట్లు చేయడానికి ఈ సమీక్ష ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేవాలయ ఏర్పాట్ల కోసం భాగస్వామ్యం అవుతున్న అందరికీ అభినందనలు తెలియజేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆలయం లోపల కేబుల్ వైర్‌లు కొత్తవి వేసి ఇబ్బందులు, ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలన్నారు. భారీ కెడింగ్ జాలి ఏర్పాటు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఆతిథ్యం ఇవ్వడంలో హైదరాబాద్ నగర ప్రజలు ఎవరికీ తీసి పోరన్నారు. దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులకు స్థానిక హైదరాబాద్ ప్రజలు వారి ఆతిథ్యం ఇవ్వాలన్నారు. ఒక్కో వారం ఒక్కో ఏరియాలో పండుగ జరుగుతుంది కాబట్టి ఆయా ప్రాంతాల్లో వాటర్ ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని.. అవసరమైతే రెండు సార్లు నీటిని ఇవ్వాలని ఆదేశించారు. హైదరాబాద్ మొత్తం ఒకేసారి పండుగ జరిగితే కొంత ఇబ్బంది ఉంటుందని.. కానీ ఒక్కో వారం ఒక్కో ఆలయంలో ఉంటుందని, భద్రత విషయంలో పోలీసులు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. అమ్మవారి ఆశీర్వాదం ఉండాలని.. ప్రభుత్వ పరంగా అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. 3600 దేవాలయాలకు సంబంధించి సమీక్ష రాష్ట్ర స్థాయి అధికారులతో జరిగిందని తెలిపారు. గోల్కొండ, ఉజ్జయిని మహంకాళి, బల్కంపేట, లాల్ దర్వాజా ఇలా ఒక్కో వారం ఒక్కో ఆలయంలో ఉత్సవాలు జరుగుతాయని.. జోగిని వాళ్ళకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని చెప్పారు. తమకు బోనం ఎత్తుకునే వారే ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. బోనాల సమయంలో కాకుండా రద్దీ తక్కువ ఉన్న సమయంలో వీఐపీ వస్తే ఇబ్బందులు ఉండవన్నారు. ఉజ్జయిని మహంకాళి బోనాలు చరిత్రలో నిలిచిపోయే విధంగా ఉండాలని తెలిపారు. డెక్కన్ మానవ సేవ సమితి , ఇతర సంస్థలు ఇక్కడ చాలా సేవ కార్యక్రమాలు చేస్తున్నాయన్నారు. అందరూ వారి సహకారం అందించి ఉత్సవాల్లో భాగస్వామ్యం కావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే తలసాని, జిల్లా కలెక్టర్ హరిచందన, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత పాల్గొన్నారు.

## భాజపాలో చేరడానికి అవి సంకేతాలు కావు: శశిథరూర్



ఇంటర్నెట్‌డెస్క్: మోదీ సర్కారు అనుకూల వ్యాఖ్యలు చేస్తూ సొంత పార్టీ నుంచి విమర్శలు ఎదుర్కొంటున్నారు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శశిథరూర్ . తాజాగా మోదీ ప్రభుత్వ విదేశాంగ విధానాలపై ప్రశంసలు కురిపిస్తూ ఆయన ఓ ఆంగ్ల పత్రికలో రాసిన వ్యాసం చర్చనీయాంశమైంది. ఈక్రమంలో ఆయన భాజపా లో చేరడం ఖాయమనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఈ ఊహాగానాలపై తాజాగా థరూర్ స్పందించారు. 'ఆపరేషన్ సిందూర్ విజయాన్ని వివరించిన వ్యాసం అది. అన్ని పార్టీల ఐక్యతను అది చెబుతోంది. ఇతర దేశాలతో సంబంధాలు బలపరుచుకోవడంలో ప్రధాని మోదీ శక్తి, చైతన్యం ప్రదర్శించారని నేను చెప్పా. ఇది భాజపా లేక కాంగ్రెస్ విదేశాంగ విధానాలకు సంబంధించింది కాదు. ఇది భారత విదేశాంగ విధానం గురించి మాత్రమే. నేను 11 ఏళ్ల క్రితం పార్లమెంటు విదేశాంగ కమిటీ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు కూడా ఇదే విషయం పేర్కొన్నా. నేను ఇలా మాట్లాడటం భాజపాలో చేరడానికి సంకేతం కాదు. ఇది జాతీయ ఐక్యతకు సంబంధించింది' అని ఆయన పేర్కొన్నారు. శశిథరూర్ రాసిన వ్యాసాన్ని ప్రధాని కార్యాలయం సోమవారం ఎక్స్‌లో పోస్టు చేసింది. అందులో ప్రపంచవ్యాప్తంగా దేశం ఒంటరిగా ఉందంటూ మోదీ ప్రభుత్వ విదేశాంగ విధానంపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలకు విరుద్ధంగా ఆయన పేర్కొనడం గమనార్హం. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత జరిగిన దౌత్యపరమైన కృషి జాతీయ సంకల్పం, ప్రభావవంతమైన వ్యక్తీకరణకు రుజువుగా పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత జరిగిన పరిణామాలు, ఆపరేషన్ సిందూర్‌తో భారత్ దృఢమైన ప్రతిస్పందనను చాటిచెప్పిందని తెలిపారు. ఇది మన విదేశాంగ విధానానికి కీలక ఘట్టాన్ని అందించిందని వ్యాఖ్యానించారు.

## అణుయుద్ధం.. నిజమెంత?



ఇజ్రాయెల్ - ఇరాన్ యుద్ధం రోజు రోజుకు మరింత ముదురుతోంది. ఇరాన్ అణుస్థావరాలపై అమెరికా మెరుపుదాడులతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. తాజాగా.. సోమవారం తెల్లవారుజామున ఇరాన్ అర గంట వ్యవధిలోనే ఇజ్రాయెల్‌పై 22 క్షిపణులతో దాడి చేసింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు చాలామంది మనసుల్లో మెదులుతున్న ప్రశ్న ఏమిటంటే.. ఈ యుద్ధం మూడో ప్రపంచ యుద్ధానికి దారి తీస్తుందా? అని!. ఈ ప్రశ్నకు సమాధానం అంత తేలిక కాదు. చాలా విషయాలను పరిగణలోకి తీసుకోవాల్సి వస్తుంది. అవేంటో.. ఒక్కటొక్కటిగా చూద్దాం. 1.ఇజ్రాయెల్- ఇరాన్ యుద్ధం మొదలైనప్పటి నుంచి దౌత్యవర్గాల్లో అణుయుద్ధంపై చర్చ జరుగుతూనే ఉంది. దశాబ్దాల తరువాత మధ్యప్రాచ్య పరిస్థితులు అణుయుద్ధానికి దారితీసేలా ఉన్నాయన్న వ్యాఖ్యలూ వినపిస్తున్నాయి. అయితే ఆ దారుణం జరక్కుండా చూసేందుకు ప్రభుత్వాధినేతలు చాలామంది తమవంతు ప్రయత్నాలూ చేస్తున్నారు. 2."అణుస్థావరాలపై అమెరికా దాడి యుద్ధం ప్రకటించడమే!" అని ఇరాన్ చెప్పడమే కాకుండా.. అణ్వాయుధాలకు సంబంధించిన అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక చట్టం నుంచి వైదొలగే ఆలోచన కూడా చేస్తోంది. 1970 నుంచి అమల్లో ఉన్న ఈ అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక చట్టం నుంచి వైదొలగడం అంటే.. ఇరాన్ తనకు నచ్చినట్టుగా అణు ఇంధనాన్ని శుద్ధి చేసుకోగలదు. అణ్వాస్త్రాలూ తయారు చేసుకోగలదు. ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ (ఐఏఈఏ) వంటి ఐరాస సంస్థల పర్యవేక్షణను అనుమతించదన్నమాట. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఇరాన్ మరింత వేగంగా అణ్వాయుధాలను తయారు చేసుకునే అవకాశం ఏర్పడుతుంది. 3. ఇదిలా ఉంటే ప్రస్తుత యుద్ధ వాతావరణంలో ఏ దేశం ఎటువైపున ఉన్నదన్నది కూడా అణుదాడులు జరిగే అవకాశాలను నిర్ణయిస్తుంది. ఇరాన్‌పై అమెరికా దాడులను రష్యా, చైనా తీవ్రంగా ఖండించాయి. అయితే ప్రస్తుతానికి ఈ రెండు దేశాలూ ఇరాన్‌కు నేరుగా మిలటరీ సాయం చేసే స్థితికి చేరలేదు. టర్కీ, ఖతార్, సౌదీ అరేబియాల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. మరోవైపు భారత్‌సహా అనేక ఆసియా దేశాలు ఇరు పక్షాలకూ దూరంగా ఉంటున్నాయి. ఉద్రిక్తతలు తగ్గించుకోవాలని, చర్చల ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఇరుదేశాలకు సూచిస్తున్నాయి. 4. అమెరికా నిన్న ఇరాన్ అణు స్థావరాలపై బంకర్ బాంబులతో విరుచుకుపడ్డ నేపథ్యంలో ఐఏఈఏ ఒక హెచ్చరిక చేసింది. పరిస్థితులు ఇలాగే కొనసాగితే ఇరాన్-ఇజ్రాయెల్ ప్రాంతంలో రేడియోధార్మిక ప్రభావం పెరిగిపోవడం ఖాయమని స్పష్టం చేసింది. ఫోర్డో, నటాన్జ్, ఇస్ఫహాన్‌లలోని అణుస్థావరాలను తాము ధ్వంసం చేసినట్లు అమెరికా ?ప్రకటించినప్పటికీ ఆ ప్రాంతాల్లో రేడియోధార్మిక పదార్థాలేవీ లేవని ఇరాన్ ప్రకటించడం కొంత ఊరటనిచ్చే అంశం. సరిగ్గా దాడులు జరిగే ముందే ఇరాన్ ఫర్డో స్థావరం నుంచి సుమారు 400 కిలోల యురేనియం (60 శాతం శు ద్ధత కలిగినది. ఆయుధాల తయారీకి కనీసం 90 శాతం శుద్ధమైన యురేనియం 235 అవసరం.)ను అక్కడి నుంచి తరలించినట్లు వార్తలొచ్చాయి. ఇంకోపక్క ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి అత్యవసర సమావేశంలో ఇజ్రాయెల్ తన వైఖరిని సమర్థించుకోగా.. వాటిని సార్వభౌమత్వంపై దాడులుగా ఇరాన్ అభివర్ణించింది. మొత్తమ్మీద చూస్తే ప్రపంచం అణుయుద్ధపు అంచుల్లో ఉందని చెప్పలేము. ఇప్పటివరకూ యుద్ధం ఇజ్రాయెల్, ఇరాన్, అమెరికాలకే పరిమితమై ఉంది. మధ్యప్రాచ్య దేశాలు, రష్యా, చైనా వంటి అభివృద్ధి చెందిన దేశాలు పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నాయి. ఇందులో మార్పు లేనంత వరకూ అణుయుద్ధం జరిగే అవకాశం తక్కువే!.

## ఇజ్రాయెల్ దాడులతో ఆజ్ఞాతంలోకి వెళ్లిన ఇరాన్ సుప్రీంలీడర్ ఖమేనీ

### చిక్కడు.. దొరకడు!
### ఆయన ఆచూకీ ఎవరికీ తెలియకుండా జాగ్రత్తలు
### కంటికి రెప్పలా కాపాడుకుంటున్న భద్రతా దళాలు
### ఖమేనీ కోసం వేట సాగిస్తున్న ఇజ్రాయెల్ నిఘా వర్గాలు



ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం నానాటికీ తీవ్రరూపం దాలుస్తోంది. దాడులు, ప్రతిదాడులకు పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ యుద్ధంలోకి అమెరికా సైతం అడుగుపెట్టడం అగ్నికి ఆజ్యం పోసినట్లయ్యింది. ఇజ్రాయెల్‌తోపాటు అమెరికాపై కత్తులు నూరుతున్న అసలు కథానాయకుడు, ఇరాన్ సుప్రీంలీడర్ అయతొల్లా అలీ ఖమేనీ ఇప్పుడు ఎక్కడున్నారు? అనేది టాప్ సీక్రెట్‌గా మారింది. దశాబ్దాలుగా ఇరాన్‌ను మకుటం లేని మహారాజులా ఏలుతున్న 86 ఏళ్ల ఖమేనీ కోసం ఇజ్రాయెల్ నిఘా వర్గాలు వేట సాగిస్తున్నాయి. ఆయనకు విదేశాల్లోనే కాదు, సొంత దేశంలోనూ శత్రువులున్నారు. ఖమేనీ ఆచూకీ దొరికితే సజీవంగా బంధించి, చట్టప్రకారం శిక్షించడమో లేక అక్కడికక్కడే అంతం చేయడమో తథ్యమని పశ్చిమ దేశాల మీడియా అంచనా వేస్తోంది. ఇరాన్‌లో తమ కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ప్రతిష్టించాలంటే ఆయన ప్రాణాలతో ఉండడానికి వీల్లేదని ఇజ్రాయెల్, అమెరికా నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఖమేనీ భౌతికంగా లేకుండాపోతేనే ఈ యుద్ధం ముగుస్తుందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్పష్టం చేయడం గమనార్హం. "ఖమేనీ ఆధునిక హిట్లర్. అతడు బతికి ఉండడానికి వీల్లేదు" అని ఇజ్రాయెల్ రక్షణ శాఖ మంత్రి కట్జ్ సైతం అన్నారు.

### చావుకు భయపడే మనిషి కాదు

ఇరాన్‌లో ఈ నెల 12న ఇజ్రాయెల్ సైన్యం హఠాత్తుగా దాడికి దిగింది. ఆ వెంటనే ఖమేనీ ఆజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. గుర్తుతెలియని ప్రాంతంలో అత్యంత పటిష్టమైన భద్రత కలిగిన బంకర్‌లో ఆయన క్షేమంగా ఉన్నట్లు ఇరాన్ అధికార వర్గాలు చెబుతున్నాయి. సుశిక్షితులైన బాడీగార్డులు ఆయనకు రక్షణ కల్పిస్తున్నట్లు పేర్కొంటున్నాయి. ఖమేనీ కచ్చితంగా ఎక్కడున్నారో ఎవరికీ తెలియకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్(ఐఆర్‌జీసీ) అత్యున్నత స్థాయి అధికారులకు సైతం ఖమేనీ ఆచూకీ గురించి తెలియదని అంటున్నారు. ఇజ్రాయెల్ నిఘా వర్గాలకు ఏమాత్రం ఉప్పందకుండా ఇరాన్ సర్కారు అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. ఖమేనీని కంటికి రెప్పలా కాపాడుకుంటోంది. ఉన్నత శ్రేణి భద్రతా దళం నిరంతరం ఆయనకు కాపలా కాస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఖమేనీ ప్రాణాలకు ఎవరూ హానీ తలపెట్టే అవకాశం లేకుండా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఖమేనీ చావుకు భయపడే మనిషి కాదని, ఇరాన్ భవిష్యత్తు కోసం ఆయన ప్రాణాలతో ఉండడం అవసరమని అన్నారు.

### అమెరికా దాడుల తర్వాత బంకర్‌లోకి..

సాధారణ పరిస్థితుల్లో ఖమేనీ సెంట్రల్ టెహ్రాన్‌లోని ఓ కాంపౌండ్‌లో ఉంటారు. అక్కడి నుంచి విధులు నిర్వర్తిస్తారు. మిలటరీ కమాండర్లు, అధికారులతో ప్రతివారం సమావేశమవుతారు. ప్రజలతో మాట్లాడాలన్నా ఇక్కడే. అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లరు. ఇజ్రాయెల్ దాడులు మొదలైన వెంటనే ఖమేనీ బంకర్‌లోకి వెళ్లలేదని సమాచారం. బయటే ఉంటూ ప్రతిదాడికి వ్యూహాలు రచించినట్లు తెలుస్తోంది. ఈ నెల 21న అమెరికా సైన్యం యుద్ధరంగంలోకి అడుగుపెట్టిన తర్వాతే ఆయన బంకర్‌లోకి చేరుకున్నారు. మూడు ప్రధాన అణు కేంద్రాలపై అమెరికా దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఈ పరిణామం తర్వాత ఖమేనీ మరింత అప్రమత్తమయ్యారు. తన విశ్వాసపాత్రులైన అనుచరులు, సహాయకులతోనూ కమ్యూనికేషన్ తగ్గించుకున్నారు. ఫోన్లు ఉపయోగించడం ఆపేశారు. ఎలక్ట్రానిక్ పరికరాలకు దూరంగా ఉంటున్నారు. శత్రువులకు తన ఆచూకీ చిక్కకుండా ఉండడానికే ఈ జాగ్రత్త. శత్రువుల చేతికి చిక్కితే మరణాన్ని చేతులారా ఆహ్వానించినట్లేనని ఖమేనీని బాగా తెలుసు. ఆయనను ఖతం చేయడానికి ఇజ్రాయెల్ ఇప్పటిదాకా చేయని ప్రయత్నమే లేదు. ఇజ్రాయెల్ ప్రత్యేక ఆపరేషన్ల ద్వారా ఎంతోమందిని హత్య చేసింది. కొద్ది రోజుల క్రితమే పేజర్ బాంబులతో హెజ్‌బొల్లా నాయకులను మట్టుబెట్టింది. ఖమేనీని మాత్రం కనీసం టచ్ చేయలేకపోయిందంటే ఆయన ఎంత సురక్షితంగా ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. "ఏదో ఒకరోజు ఇజ్రాయెల్ నన్ను చంపేయడం ఖాయం. దేశం కోసం వీరమరణం పొందడం నాకు సంతోషమే" అని కొన్నేళ్ల క్రితం ఖమేనీ వ్యాఖ్యానించారు.

## రోబో ట్యాక్సీని ప్రారంభించిన టెస్లా

### ఏవీ.. డ్రైవర్ లేకుండానే!
### స్వయం చోదక వాహనాల పరుగులు
### భారత్‌లో ప్రారంభ దశలో ఏవీల అభివృద్ధి
### యూఎస్, చైనాలో ఇప్పటికే పరుగులు
### దారి చూపుతూ, దిశానిర్దేశం చేస్తున్న ఏఐ




అమెరికాలోని ఆస్టిన్ నగర వీధుల్లో ఒక ఎర్ర కారు.. దానిమీద 'రోబో ట్యాక్సీ' అని రాసి ఉంది. ఇది సెల్ఫ్ డ్రైవింగ్ లేదా డ్రైవర్ రహిత కారు. ప్రపంచ ప్రసిద్ధ టెస్లా కంపెనీ ఈ రోబో ట్యాక్సీ సేవలను ఆదివారం ప్రారంభించింది. దీంతో ఇప్పుడు స్వయం చోదక వాహనాల (అటానమస్ వెహికల్ -ఏవీ) మీద చర్చ మరోసారి మొదలైంది. యూఎస్ఏలోని సిలికాన్ వ్యాలీ, చైనాలోని బీజింగ్ నగరంలో ఇప్పటికే ఏవీలు పరుగులు తీస్తున్నాయి. సరుకు రవాణా కోసం అటానమస్ ట్రక్స్ దూసుకెళుతున్నాయి. ప్రపంచంలో వాహనాల తయారీలో నాలుగో స్థానంలో ఉన్న భారత్‌లో.. ఏవీలు సాకారం అయ్యే అవకాశాలు ఎప్పుడెప్పుడా అని వాహన ప్రియులు ఎదురుచూస్తున్నారు. అసలు ఏవీలు ఎక్కడెక్కడ ఏయే స్థాయిల్లో ఉన్నాయి.. ఏవీ ఎలా పనిచేస్తుంది.. డ్రైవర్ లేకుండా ఇది ఎలా నడుస్తుంది?

### విదేశాల్లో ఇలా..

సాధారణ క్యాబ్స్‌తో పోలిస్తే పలు దేశాల్లో అటానమస్ వెహికల్స్ ఆధారిత క్యాబ్స్ సగం చార్జీలనే వసూలు చేస్తున్నాయి. ఒక్క యూఎస్‌లోనే ఒక ట్రిలియన్ డాలర్ల వ్యాపార అవకాశాలు ఉన్నాయని ఊబర్ సీఈవో దారా కాస్రోసాహీ ఇటీవల వెల్లడించారు. గూగుల్ మాతృ సంస్థ ఆల్ఫాబెట్‌కు చెందిన వేమో ఇప్పటికే యూఎస్, చైనాలో అటానమస్ వెహికల్స్‌తో రైడ్ హెయిలింగ్ సేవలు ఆఫర్ చేస్తోంది. యూఎస్‌కు చెందిన పోనీ.ఏఐ అటానమస్ క్యాబ్స్ సర్వీసులు అందిస్తోంది. అలాగే అటానమస్ ట్రక్స్ ద్వారా సరుకు రవాణా రంగంలోనూ ఉంది. భారత్‌కు చెందిన గౌతమ్ నారంగ్, అర్జున్ నారంగ్, అపేక్ష కుమావత్ కలిసి అమెరికాలో ఏర్పాటుచేసిన 'గతిక్.ఏఐ' అనే కంపెనీ అటానమస్ ట్రక్స్ ద్వారా వాల్‌మార్ట్ వంటి కంపెనీలకు సేవలందిస్తోంది. న్యూరో అనే కంపెనీ చిన్న అటానమస్ వ్యాన్స్ ద్వారా యూఎస్‌లో సరుకు రవాణా చేస్తోంది. చైనాలో డీప్‌రూట్.ఏఐ ఈ రంగంలో ఉంది. వీరైడ్, వాబి, మోషనల్, అరోరా తదితర కంపెనీలు సైతం అటానమస్ వెహికల్స్‌తో పోటీపడుతున్నాయి. అమెరికాలోని ఆస్టిన్ నగరంలో టెస్లా కంపెనీకి చెందిన రోబో ట్యాక్సీలను లాంఛనంగా ప్రారంభించారు. దశాబ్దాల కఠోర శ్రమకు ఇది ఫలితమని, అయితే ఇది పైలట్ ప్రాజెక్టేనని టెస్లా కంపెనీ అధినేత ఎలన్ మస్క్ తెలిపారు. ప్రస్తుతం ట్రిప్పునకు 4.20 డాలర్లు (సుమారు రూ.364) వసూలు చేస్తున్నారు. ఈ క్యాబ్స్ పూర్తిస్థాయిలో ప్రజలందరికీ ఎప్పటికి అందుబాటులోకి వస్తాయో మస్క్ ఇంకా ప్రకటించలేదు. మనదేశం విషయానికొస్తే.. టాటా మోటార్స్ ఇటీవల వైయు అనే పూర్తిస్థాయి అటానమస్ వాణిజ్య వాహనానికి పేటెంట్ పొందింది. దీనికి చాలా ప్రత్యేకతలు ఉన్నాయి. ఇది వస్తువులు, ప్రయాణికుల రవాణాకు అనుకూలమైనది.

### మన దేశంలో ప్రారంభ దశలోనే..

అటానమస్ వెహికల్స్ రాకతో ఆటోమొబైల్ పరిశ్రమలో సాంకేతికంగా పెద్ద ముందడుగు పడిందని చెప్పవచ్చు. భారత్‌లో అటానమస్ వెహికల్స్ అభివృద్ధి ఇంకా ప్రారంభ దశలోనే ఉందని చెప్పాలి. పూర్తిగా అటానమస్ అంటే డ్రైవర్ అవసరమే లేకుండా నడిచే వాహనాలు (లెవెల్-5) ఇంకా వాణిజ్యపరంగా అందుబాటులో లేనప్పటికీ.. అడ్వాన్స్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్స్ (ఏడీఏఎస్) అభివృద్ధి, అటానమస్ దిశగా సాంకేతికతల పరీక్షల్లో పురోగతి ఉంది. భారత్‌లో మైనస్ జీరో, స్వాయత్ రోబోస్, టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా ఈలిక్సీ, ఫ్లక్స్ ఆటో, ఫ్లో మొబిలిటీ తదితర కంపెనీలు ఏవీల అభివృద్ధిపై దృష్టి సారించాయి. ఇదిలా ఉంటే.. డ్రైవర్‌లెస్ కార్లను భారత్‌లో అనుమతించేది లేదని పలు సందర్భాల్లో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చెబుతూ వచ్చారు.

### 5 లెవెల్స్‌లో..

వాహనాల నియంత్రణ, నిర్వ హణ విషయంలో ఆటోమేషన్ స్థాయిని బట్టి లెవెల్-0 నుంచి పూర్తి అటానమస్ లెవల్-5 వరకు.. ఏవీలను 6 స్థాయిలుగా వర్గీకరించారు. లెవెల్ - 0 అంటే పూర్తిగా డ్రైవర్‌పైనే ఆధారపడి ఉంటుంది. లెవెల్ - 1లో అడాప్టివ్ క్రూజ్ కంట్రోల్ ఉంటుంది. ముందున్న వాహనం వేగాన్ని బట్టి ఏవీ దానంతట అదే వేగాన్ని నియంత్రించుకుంటుంది. లెవెల్ - 2లో సాంకేతికత స్టీరింగ్‌ను, వేగాన్ని నియంత్రిస్తుంది. లెవెల్ 1, 2లలో కచ్చితంగా డ్రైవర్ ఉండాల్సిందే. లెవెల్ -3లో ప్రత్యేక పరిస్థితుల్లో వాహనం దానంతట అదే నియంత్రించుకుంటుంది. కానీ, కొన్ని సందర్భాల్లో కారు ఇచ్చే అలర్ట్స్‌ను బట్టి డ్రైవర్ స్టీరింగ్‌ను తన చేతుల్లోకి తీసుకోవాల్సి ఉంటుంది. లెవెల్ -4 అంటే.. చాలా అరుదుగా తప్ప, దాదాపుగా డ్రైవర్ అవసరం లేకుండానే కారు నడుస్తుంది. వీటిని ఎక్కడ పడితే అక్కడ నడపడం సాధ్యం కాదు. ప్రత్యేకమైన ప్రాంతంలోనే (జియో ఫెన్సింగ్ సాయంతో) నడుపుతారు. అంటే ఆ ప్రాంతానికి సంబంధించిన పూర్తి వివరాలే ఫీడ్ చేస్తారన్నమాట. ఆ పరిస్థితుల్లోనే కారు నడవగలదు. లెవెల్ - 5.. అసలు డ్రైవర్ అవసరమే ఉండదు. పూర్తిగా కారు తనంతట తానే నడుస్తుంది. ప్రపంచంలో లెవెల్ - 5 స్థాయి వాహనాలను ఎవరూ తయారుచేయలేదు.

### సెన్సార్స్, కెమెరాలతో..

అటానమస్ వెహికల్స్ వాటి పరిసరాలను ఎప్పటికప్పుడు అధ్యయనం చేసి రూట్ మ్యాప్‌ను నిర్మించడానికి, నవీకరించడానికి పలు సెన్సార్లపై ఆధారపడతాయి. రాడార్ సెన్సార్లు సమీపంలోని వాహనాలను ట్రాక్ చేస్తాయి. కెమెరాలు ట్రాఫిక్ సిగ్నల్స్‌ను గుర్తిస్తాయి. అలాగే రహదారి సంకేతాలను అర్థం చేసుకుంటాయి. పాదచారులు, ఇతర వాహనాల కదలికలను గమనిస్తుంటాయి. లైడార్ (లైట్ డిటెక్షన్ అండ్ రేంజింగ్) సాంకేతికత దూరాలను కొలవడానికీ లేన్ గుర్తులను, రహదారి సరిహద్దులను గుర్తించడానికి లేజర్ పల్స్‌లను ఉపయోగిస్తుంది. వాహనం చుట్టుపక్కల ఉన్న ప్రాంతాన్ని అధిక రిజొల్యూషన్ 3డీ మ్యాప్‌గా సృష్టిస్తుంది. అడ్డంకులు, పాదచారులు, ఇతర వాహనాలను గుర్తించడంలో సహాయపడుతుంది. వాహనాలను నిలిపేందుకు నిర్దేశించిన గీతలను, చుట్టూ ఉన్న కార్లను గుర్తించేందుకు చక్రాల దగ్గర పొందుపరిచిన అల్ట్రాసోనిక్ సెన్సార్లు సహాయపడతాయి. ట్రాఫిక్ సంకేతాలు, పాదచారుల సమాచారాన్ని ఇతర కెమెరాలు అందిస్తాయి. ఏవీల్లో గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ (జీపీఎస్), ఇనెర్షియల్ మెజర్‌మెంట్ యూనిట్ (ఐఎంయూ) కూడా ఉన్నాయి. లొకేషన్ కు సంబంధించిన సమాచారాన్ని జీపీఎస్ అందిస్తుంది. వాహన వేగం, దిశలో వచ్చే మార్పును ఐఎంయూ ట్రాక్ చేస్తుంది. సెన్సార్స్ అందించిన డేటాను అత్యంత సామర్థ్యం గల సాఫ్ట్‌వేర్ ప్రాసెస్ చేస్తుంది. ఇది సరైన మార్గాన్ని నిర్ణయించడంతోపాటు వాహన వేగం, దిశ, బ్రేకింగ్, స్టీరింగ్‌ను నియంత్రిస్తుంది. ముందే పొందుపరిచిన ట్రాఫిక్ నియమాలు, అడ్డంకులను గుర్తించే విధానాలు, పరిసరాల అధ్యయనం, మనుషులు, యంత్రాల గుర్తింపు ద్వారా ఈ సాంకేతిక వ్యవస్థ సురక్షిత, సమర్థవంత ప్రయాణాన్ని అందిస్తుంది.